

ముంపు ముప్పు..!

- వంకల్లో యథేచ్ఛగా ఆక్రమణలు
- నోటీసులతో సరిపెట్టిన అధికారులు
- నడిమివంక, మరువవంకలో పేరుకుపోయిన పూడిక
- ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు
- వర్షాకాలం నేపథ్యంలో పొంచివున్న ప్రమాదం



మరువ వంకలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు



నడిమివంక

అనంతపురం క్రైం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం మొదలైంది. భారీవర్షాల సూచనల నేపథ్యంలో అనంత జనం వణికిపోతున్నారు. భారీ వర్షాలకు వరద నీరు ఉప్పొంగితే పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారు. ప్రధానమైన నడిమివంక, మరువ వంక ఆక్రమణలతో కుంచించుకుపోయాయి. కాలువలు పూడికతో నిండిపోయాయి. నీరు ముందుకు కదిలే పరిస్థితి లేదు. వరద నీరు ఉప్పొంగితే కాలనీలు నీట మునగాల్సిందే. గత వైపరీత్యాలను నెమరేసుకుంటూ నగర వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా మేల్కొని, ఆక్రమణలు తొలగించి, పూడిక తీయకపోతే వర్షాకాలంలో ముంపు ముప్పు తప్పదని భయపడిపోతున్నారు.

ప్రధాన వంకలపైనా నిర్లక్ష్యం

నగరంలో ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలతో పాటు వంకలను సైతం వదలట్లేదు. ప్రధాన మురుగు కాలువల పక్కనే ఆక్రమించేసి ఇళ్లు కట్టేశారు. గత కొన్నేళ్లలో ఇవన్నీ వందల సంఖ్యకు పెరిగాయి. పాలకులు, అధికారుల అలసత్వం పుణ్యమా అని ఆక్రమణలతో ప్రధాన కాలువలు కుంచించుకుపోయాయి. నగరంలో చిన్నచిన్న కాలువల నుంచి పెద్ద మురికి కాలువల వరకు అన్నీ కలిసేది నడిమి వంక, మరువవంకలోనే. కిలోమీటర్ల మేర ఉండే ఈ వంకలు వర్షాకాలంలో అత్యంత కీలకం. నడిమివంక నగర శివారులోని బైపాస్ నుంచి ప్రారంభమై సోములదొడ్డి వద్ద కలుస్తుంది. దాదాపు 3 కిలోమీటర్ల మేర నడిమి వంక వెళ్తుంది. మరువవంక కలెక్టరేట్ సమీపంలో ప్రారంభమై సోములదొడ్డి వరకు వెళ్తుంది. 4 కిలోమీటర్ల మేర కాలువ ఉంది. నగరంలోని ప్రధాన కాలనీల మీదుగా ఈ కాలువలు (మిగతా 6లో...)

వీడియో చూపించి.. బెదిరించి..!

బాలిక జీవితంతో ఆడుకున్న మృగాళ్లు

- సమగ్ర దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు
- అదుపులో ఏడుగురు.. పరారీలో ఎనిమిది మంది



రామగిరి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఏమీ తెలియని వయసు. చనువుగా ఉంటూ మొదట ఒకరు లోబరుచుకున్నారు. లైంగిక దాడి చేశారు. ఆ దృశ్యాలను మరో యువకుడు తన సెల్‌ఫోన్‌లో బంధించాడు. వాటిని ఇతరులకు షేర్ చేయడంతో అవి వైరల్ అయ్యాయి. ఆ వీడియోలు చూపించి, బెదిరించి.. ఒక్కొక్కరుగా బాలికపై లైంగిక దాడికి తెగబడ్డారు. సుమారు ఏడు నెలల నుంచి ఈ దారుణాలు కొనసాగాయి. రామగిరి మండలంలోని ఓ గ్రామంలో జరిగిన ఈ ఘటనను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు. బాలికపై ఏకంగా 13 మంది లైంగిక దాడి చేశారని, మరో ఇద్దరు సహకరించారని ప్రాథమికంగా నిర్ధారించారు. వీరిలో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న మరో ఎనిమిది మంది కోసం గాలిస్తున్నారు.

మూడేళ్ల క్రితం మొదలు..

బాధిత బాలిక ఏడో తరగతిలో ఉండగా దళిత సామాజికవర్గానికే చెందిన ఓ యువకుడు స్నేహంగా ఉండేవాడు. పసితనంలో వారిద్దరూ చనువుగా ఉన్న దృశ్యాలను సెల్‌ఫోన్‌లో బంధించిన మరో యువకుడు.. అప్పటి నుంచి బ్లాక్‌మెయిల్ ప్రారంభించినట్లు సమాచారం. ఆ వీడియోలను చూపించి, బెదిరించి లొంగదీసుకున్నట్లు తెలిసింది. గడిచిన ఐదు నెలల నుంచి ఆ ఊరి యువకుల్లో కొందరు బరితెగించి వ్యవహరించారని సమాచారం. ఒకరిని చూసి ఒకరు ఆ బాలికను బెదిరిస్తూ లైంగిక దాడికి పాల్పడ్డారు. విశ్వసనీయ సమాచారం మేరకు, ఆ అమ్మాయితో ఎక్కువ చనువుగా ఉండే దళిత యువకుడు కూడా అఘాయిత్యం చేశాడు. బాలికకు గర్భం రావడంతో ఆందోళన చెందిన ఆమె తల్లి, (మిగతా 6లో...)

వడ్డీ జలగలు..!

- జిల్లాలో మైక్రో ఫైనాన్స్ సంస్థల ఆగడాలు
- అధిక వడ్డీలతో పేదల నడ్డి విరుస్తున్న వైనం
- వారం వారం వాయిదా చెల్లింపులు
- ఆలస్యమైతే అక్రమ వసూళ్లు
- వీధిన పడుతున్న కుటుంబాలు



పుట్టపర్తిటౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజల ఆర్థిక అవసరాలు, ఇబ్బందులను ఆసరాగా చేసుకుని మైక్రో ఫైనాన్స్ సంస్థలు పేట్రేగిపోతున్నాయి. అధిక వడ్డీలకు రుణాలు ఇస్తూ ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నాయి. రికవరీ ఏజెంట్లు ప్రతివారం ఇళ్ల వద్దకు వచ్చి రుణగ్రహీతలను వేధిస్తున్నారు. సకాలంలో చెల్లించకపోతే అదనపు వసూళ్లకు పాల్పడుతూ, ఇళ్ల వద్ద పరువు తీస్తున్నారు. ఈ మైక్రోఫైనాన్స్ సంస్థల బారినపడి అనేక మంది రోడ్డున పడుతున్నారు. ప్రభుత్వం వీరి ఆగడాలను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పురుష సంఘాలు ఏర్పాటు చేసి అప్పులు

సాధారణంగా మహిళా సంఘాలకు అప్పులు ఇవ్వడం చూశాం. అయితే మైక్రో ఫైనాన్స్‌సంస్థలు పురుషుల సంఘాలను ఏర్పాటు చేసి అప్పులిస్తున్నాయి. గ్రామాల్లో డబ్బులు అవసరమున్నవారిని గుర్తించి ఐదుగురు పురుషులను ఒక సంఘంగా ఏర్పాటు చేసి రూ.50వేల నుంచి రూ.2లక్షల వరకు అప్పులు ఇస్తాయి. ముందుగా లక్షకు రూ.10వేల చొప్పున తీసుకుని ఆ పై వారం వారం సంఘం రూ.10వేలు చెల్లించేవిధంగా ఒప్పందం కుదుర్చుకుంటారు. ఈ విధంగా పది వారాల పాటు రికవరీ ఏజెంట్లు ఇళ్ల వద్దకు వచ్చి వసూలు చేసుకుని వెళ్తారు. గ్రూపులో ఏ ఒక్కరు వాయిదా ఆలస్యం చేసిన మిగిలిన వారిని బాధ్యులను చేసి సతాయిస్తారు. ఒకవారం వాయిదా ఆలస్యమైతే చక్రవడ్డీతో వసూలు చేస్తారు. మహిళా సంఘాల గ్రూపులకు కూడా ఈ మైక్రో ఫైనాన్స్ సంస్థలు అప్పులు ఇస్తుండటం గమనార్హం.

చిరు వ్యాపారులే టార్గెట్

జిల్లాలోని మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీ కేంద్రాలలో టీ కొట్టు దుకాణాలు, కిరాణాకొట్లు, కూరగాయలు, చికెన్‌సెంటర్ల నిర్వాహకులే లక్ష్యంగా ఈ సంస్థలు అధిక వడ్డీలకు రుణాలు ఇస్తాయి. రోజు వారి లేక వారం వారం వాయిదాల పద్ధతిలో డబ్బులు వసూళు చేస్తారు. ఫైనాన్స్ సంస్థలు డబ్బు వసూలు కోసం నిరుద్యోగులైన యువకులను తక్కువ జీతాలకే ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఈ యువకులు రివకరీ ఏజెంట్లుగా అప్పు తీసుకున్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి కలెక్షన్ చేసుకుని సంస్థల్లో చెల్లిస్తుంటారు. అప్పులు చెల్లించడం ఏ మాత్రం ఆలస్యమైన ఈ రికవరీ ఏజెంట్లు చేసే అఘాయుత్యాలు అన్ని ఇన్నీకావు. అప్పు తీసుకున్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి పరువు తీస్తారు. కొంతమంది వీరి ఆగడాలు భరించలేక గ్రామం వదిలి వెళ్లిన సందర్భాలు కూడా ఉన్నాయి.

జిల్లాలో నాలుగు కేంద్రాల్లో మైక్రోఫైనాన్స్ సంస్థలు

జిల్లాలోని పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, హిందూపురం కేంద్రాలుగా ఈ మైక్రోసంస్థలు కార్యకలాపాల కొనసాగిస్తున్నాయి. కొందరు ప్రైవేటు వ్యక్తులు కూడా గ్రూపుగా ఏర్పడి అనధికారికంగా ఫైనాన్స్‌సంస్థలు నడుపుతున్నారు. ప్రభుత్వ నిబంధనలు ఏ మాత్రం పట్టించుకోకుండా అధిక వడ్డీలకు అప్పులిస్తూ గ్రామీణ ప్రజలను (మిగతా 6లో..)

ఉపాధి బకాయిలు

రూ.190 కోట్లు..!

కూలీలకు రూ.92 కోట్లు..
మెటీరియల్‌కు రూ.98 కోట్లు పెండింగ్

- మూడు నెలలుగా అందని బిల్లులు
- ఉద్యోగులకు ఐదు నెలలుగా జీతాల్లేవ్
- అయినా.. సిబ్బందిపై టార్గెట్ల ఒత్తిడి



జీతాలు చెల్లించాలని ఇటీవల పీడీకి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో బకాయిలు పేరుకుపోయాయి. మూడు నెలలుగా కూలీలకు బిల్లులు చెల్లించలేదు. మెటీరియల్‌కు కూడా నిధులు రాలేదు. అనంతపురం జిల్లాలో ఏకంగా రూ.190 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి ఐదు నెలలుగా వేతనాల్లేవు. బిల్లులు అందకపోవడంతో పనులకు వచ్చేందుకు కూలీలు ససేమిరా అంటున్నారు. మెటీరియల్ సరఫరాకు కాంట్రాక్టర్లు ముందుకు రావట్లేదు. వేతనాలివ్వాలంటూ ఉద్యోగులు, సిబ్బంది.. ఉన్నతాధికారులు వినతులు ఇచ్చుకుంటున్నారు. అయినా, లక్ష్యం మేరకు కూలీల సంఖ్య పెంచాలంటూ ఉపాధి సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారు. కూలీలు పనులకు రాకపోవడంతో వారు తలలు పట్టుకుంటున్నారు.

సీజన్‌లో పెండింగ్..

సాధారణంగా మార్చి నుంచి ఉపాధి పనులు ఊపందుకుంటాయి. నాలుగైదు నెలలపాటు సీజన్‌లో జాబ్‌కార్డుదారులు అడిగినన్ని పనులు కల్పిస్తారు. మూడు నెలలుగా ఉపాధి కూలీలకు వేతన బిల్లులు సుమారు రూ.92కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. బకాయిలు చెల్లించకుంటే పనులు నిలిపివేస్తామని కూలీలు.. ఉపాధి సిబ్బందిని హెచ్చరిస్తున్నారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోతే ఎలాగనీ, తాము ఏమి తిని బతకాలంటూ ప్రశ్నిస్తున్నారు. మెటీరియల్ కాంపోనెంట్ కింద నిర్మాణ పనులు చేయించి పనిదినాలు పెంచాలన్నా.. బకాయిలు అడ్డంకిగా మరాయి. మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.98కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఉపాధి సిబ్బందికి సైతం ఐదు నెలలుగా వేతనాలు చెల్లించలేదు. దీంతో అటు ఉపాధి కూలీలు, ఇటు ఉద్యోగులు బకాయి వేతనాల కోసం తంటాలు పడుతున్నారు. పథకం మెదలైన నాటి నుంచి ఉపాధి ఉద్యోగులకు ఐదు నెలల వేతనాలు పెండింగ్‌లో పెట్టినట్లు దాఖలాల్లేవని ఆశాఖ వర్గాలు చెబుతున్నాయి. పాలకులు, ఉన్నతాధికారులు వెంటనే బకాయిలు చెల్లించాలని ఉపాధి కూలీలు, ఉద్యోగులు కోరుతున్నారు. సాధారణంగా పనిచేసిన పదిరోజుల్లోపు కూలీ బ్యాంకు ఖాతాల్లో బిల్లులు జమచేయాలి. మూడు నెలలైనా చెల్లించకపోవడంతో వారు ఆవేదన చెందుతున్నారు.

ఆరు నెలలుగా పెండింగ్..

ఉపాధి పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించి రూ.98 కోట్ల బకాయిలున్నాయి. గతేడాది డిసెంబరు 12న చివరగా ఉపాధి కింద చేసిన మెటీరియల్ కాంపోనెంట్ బిల్లులు చెల్లించారు. ఈలెక్కన దాదాపు 6 నెలలుగా ఉపాధి నిర్మాణాలకు సంబంధించి పైసా కూడా చెల్లించలేదు. సాధారణంగా మెటీరియల్ కాంపోనెంట్ బిల్లులు.. ఉపాధి కూలీల వేతనాల కంటే తక్కువగా (మిగతా 6లో..)

నేడు బక్రీద్

ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ఏర్పాట్లు.. కొండెక్కిన పొట్టేళ్ల ధరలు



హౌసింగ్‌బోర్డు ఈద్గాలో ఏర్పాట్లు

7

సీఎంఓకు వెళ్లిన అర్జీపైనా నిర్లక్ష్యమేనా..?

కలెక్టర్ ఆగ్రహం..
తహసీల్దార్, వీఆర్వోకు
షోకాజ్ నోటీసులు



అనంతపురం టౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): సీఎం ఆఫీస్‌లో బాధితుడు ఇచ్చిన అర్జీని పరిష్కరించడంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంపై కలెక్టర్ వినోద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సీఎంఓకు వెళ్లిన అర్జీదారుడితో శుక్రవారం ఆయన ఫోన్‌లో మాట్లాడారు. 'మీ సమస్య ఏమిటి? అధికారులను కలిశారా? వారు ఏం చేశారు?' అని అడిగారు. ఇక్కడి అధికారులు పట్టించుకోవడంలేదని బాధితుడు వాపోయాడు. తర్వాత సంబంధిత తహసీల్దార్, వీఆర్వోతో కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడారు. ఫిర్యాదు పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారని అడగ్గా.. వారు సరైన సమాధానాలు చెప్పలేకపోయారు. దీంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్, వీఆర్వోకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

డాక్టర్లూ... వైఖరి మార్చుకోండి..

డాక్టర్లు తమ వైఖరిని మార్చుకుని, రోగులతో స్నేహపూర్వకంగా మెలగాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లో వైద్యశాఖ అధికారులు, పీహెచ్‌సీల డాక్టర్లతో కలెక్టరు శుక్రవారం సమీక్ష చేశారు. ప్రభుత్వం డాక్టర్ల పనితీరుపై నిఘా ఉంచిందన్నారు. ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహిస్తూ పనితీరును బేరీజు వేస్తోందన్నారు. వైద్యులు, సిబ్బంది మీతో స్నేహంగా మెలగారా? డాక్టర్లు మిమ్మలను పరీక్షించారా? ఉచితంగా మందులు ఇచ్చారా? స్కాన్ చేశారా అంటూ ప్రభుత్వం రోగులను అడిగి తెలుసుకుంటోందన్నారు. ఈ ఫీడ్ బ్యాక్‌లో వైద్యులు, సిబ్బంది పనితీరు పట్ల రోగుల నుంచి అధికశాతం అసంతృప్తి వ్యక్తమవుతోందన్నారు. డాక్టర్లు, సిబ్బంది ప్రొఫెషనల్‌గా ఉండాలని, ప్రవర్తన మంచిగా ఉండాలని సూచించారు. మందుల సమస్య ఎక్కడా రాకూడదని, ఫార్మసిస్టులతో ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీ దేవి, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టరు కిరణ్‌కుమార్ రెడ్డి, జిల్లాలోని పీహెచ్‌సీల డాక్టర్లు పాల్గొన్నారు.

రాత్రి వరకూ కౌన్సెలింగ్

టీచర్లకు తప్పని కష్టాలు

రోస్టర్‌పై కార్పొరేషన్ టీచర్ల వాగ్వాదం



కేఎస్‌ఆర్ హైస్కూల్‌లో కౌన్సెలింగ్ కోసం వచ్చిన టీచర్లు, వారి బంధువుల పడిగాపులు





కేఎస్‌ఆర్ హైస్కూల్‌లో కౌన్సెలింగ్ సందడి, శారదా స్కూల్‌లో రాత్రి 10.30 గంటలపుడు కౌన్సెలింగ్ ఆగడంతో టీచర్ల టెన్షన్

అనంతపురం విద్య, జూన్ 6(ఆంధ్రజ్యోతి): స్కూల్ అసిస్టెంట్ల ప్రమోషన్ల కౌన్సెలింగ్ శుక్రవారం రాత్రి వరకూ కొనసాగింది. మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్, గవర్నమెంట్, జడ్పీ టీచర్లు సర్టిఫికెట్ల వెరిఫికేషన్, కౌన్సెలింగ్ కోసం ఉదయం నుంచి రాత్రి వరకూ నిరీక్షించారు. మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్, గవర్నమెంట్ ఎస్ఏ ప్రమోషన్ పోస్టులకు శుక్రవారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న వారికి పోస్టింగ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ ప్రక్రియ సైన్స్ సెంటర్‌లో జరుగుతుందని ఉదయం తెలిపారు. తర్వాత కేఎస్‌ఆర్ హైస్కూల్‌లో కౌన్సెలింగ్ అంటూ అధికారులు హడావుడి చేశారు. దీంతో ఉపాధ్యాయులు గందరగోళానికి గురయ్యారు. ఉదయం అనుకున్న కౌన్సెలింగ్ మధ్యాహ్నం (మిగతా 6వ పేజీలో..)



అలసిపోయి... నిద్రలోకి జారుకుంటున్న టీచర్లు, బంధువులు

ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్
అనంతపురం బ్రాంచి, అనంతపురం. ఫోన్ : 08554-244220

APPENDEX IV [RULE 8(1)]
స్వాధీనత ప్రకటన (స్థిరాస్థి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టము 2002 క్రింద ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్, అనంతపురం బ్రాంచి యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంటు) రూల్స్ 2002 అందలి రూల్ 3 తో కలిపి చదువవలసిన సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ ఒక డిమాండు నోటీసు తేది 20-02-2025 న ఇచ్చియున్నారు. ఆ నోటీసు తేది నుండి 60 రోజుల లోపుగా రూ. 4,42,496/- (అక్షరములా నాలుగు లక్షల నలభై రెండు వేల నాలుగు వందల తొంభై ఆరు రూపాయి మాత్రమే) తేది 31-01-2025 నాటికి చెల్లించవలసినదిగా ఋణగ్రహీతలు/కో-ఆబ్లిగెంట్/హామీదారులు అయిన 1) శ్రీ షేక్ మహబూబ్ పీరా, S/o. షేక్ అబ్దుల్ రహిమాన్, 2) శ్రీమతి షేక్ దిల్షాద్, W/o. షేక్ మహబూబ్ పీరా వారిని కోరడమైనది.

కానీ ఋణగ్రహీతలు/ కోఆబ్లిగెంట్/హామీదారులు ఋణమును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఋణగ్రహీతలకు/ కోఆబ్లిగెంట్/హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా సదరు రూల్ యొక్క 8వ రూల్‌తో కలిపి చదువుకోవాల్సిన సదరు యాక్ట్ యొక్క సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొంటూ దిగువ సంతకందారు దిగువ వివరించిన ఆస్తిపై తేది 2-6-2025 న స్వాధీనత తీసుకొని యున్నారు.

కావున సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగాఋణగ్రహీతలకు/ కోఆబ్లిగెంట్/హామీదారులకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎట్టి లావాదేవీలు జరుపరాదు, మరియు సదరు ఆస్తికి సంబంధించిన ఎట్టి లావాదేవీలైనా రూ. 4,42,496/- మొత్తానికి మరియు తేది 01-02-2025 నుండి దాని మీద దర్మిలా వడ్డీ మరియు ఖర్చులు ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, అనంతపురం బ్రాంచి, అనంతపురం వారి చార్జీకి లోబడి ఉంటాయి.

స్థిరాస్థి వివరములు : అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్, సర్వే నెం. 130 పరిధిలోని అనంతపురం, పాపంపేట, ఆజాద్ నగర్‌లోని ప్రస్తుత వార్డు నెం. 6, పాత వార్డు నెం. 4, పాత డోర్ నెం. 6/563, కొత్త డోర్ నెం. 6-557-5గాగల తీరుబండ ఇల్లు.

హద్దులు : తూర్పు : సాదిక్ వలీ గారి ఇల్లు, దక్షిణం: రోడ్డు
పడమర : ఎస్.సఫీ గారి ఇల్లు, ఉత్తరం : ఎస్. సఫీ గారి ఖాళీ స్థలం
మొత్తం విస్తీర్ణం :33.18చ॥ గజములు

తేది : 06-06-2025, అనంతపురం
అధీకృత అధికారి, అనంతపురం బ్రాంచి

నేడు కసాపురం ఆలయ భూముల వేలం

గుంతకల్లుటౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయానికి చెందిన వజ్రకరూరు మండలంలోని వ్యవసాయ భూములను కౌలుకు చేసుకునేందుకు శనివారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వాణి ప్రకటనలో తెలిపారు. సర్వే నంబరు 122లోని 1వ ప్లాటులో 14 ఎకరాలు, 2వ ప్లాటులో 13.62 ఎకరాల భూమిని మూడేళ్ల కౌలుకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నామన్నారు. వజ్రకరూరులోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు వేలంపాట ఉంటుందన్నారు. ఆసక్తిగల రైతులు పాల్గొనాలని ఈఓ తెలిపారు.

రాష్ట్ర కార్యవర్గంలో జిల్లాకి చోటు

ప్రభుత్వోద్యోగుల సంఘం రాష్ట్రకార్యదర్శులుగా హనుమంతు, సాంబశివమ్మ


హనుమంతు


సాంబశివమ్మ

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వోద్యోగుల సంఘం రాష్ట్రకార్యదర్శులుగా జిల్లాకు చెందిన హనుమంతు, సాంబశివమ్మ నియమితులయ్యారు. శుక్రవారం విజయవాడలో నిర్వహించిన సమావేశంలో వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ సమక్షంలో వారు ప్రమాణస్వీకారం చేయించారు. ఎన్నికైన వారిని సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు గోపీకృష్ణ, రామునాయక్.. హనుమంతు, సాంబశివమ్మను సన్మానించారు.

'ఆడుదాం ఆంధ్ర'పై విజిలెన్స్ విచారణ


క్రీడాకారులను విచారిస్తున్న విజిలెన్స్ అధికారులు

గోరంట్ల, జూన్6 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో అవినీతి జరిగిందన్న ఆరోపణలపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం మండలంలో విచారణ నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విజిలెన్స్ అధికారి వాసుప్రకాష్, ఎస్ఐ గోపాలుడు విచారణ చేపట్టారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులను పిలిపించి విచారించారు. గౌనివారిపల్లికి చెందిన క్రీడాకారులు మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు రామమోహన్, క్రిష్టారెడ్డి, రామచంద్రనాయక్ విచారణలో పాల్గొన్నారు. మండలంలోని 20 పంచాయతీల్లో గ్రామ, మండలస్థాయిలో ఐదురకాల క్రీడాపోటీలు నిర్వహించారు. ఇందుకోసం పంచాయతీకి ప్రభుత్వం రూ.పది వేలు కేటాయించింది. పంచాయతీకి బాలురు, బాలికల కోసం రెండు స్పోర్ట్స్ కిట్లు మంజూరు చేశారు. క్రీడాకారులకు టీషర్టు, క్యాపులు తదితర సామగ్రి అందించారు. మండల స్థాయి క్రీడల్లో మొత్తం 196 జట్లు పాల్గొన్నాయి. కబడ్డీ, కోకో, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడల్లో పంచాయతీకి 20మంది వంతున బాలురు, బాలికలు విడివిడిగా పాల్గొన్నారు. క్రీడాకారుల ఎంపిక, నిర్వహణ బాధ్యత విద్యాశాఖ ఆధ్వర్యంలోనూ నిధుల వినియోగం, మండల పరిషత్ అధికారుల పర్యవేక్షణలో జరిపారు. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా అక్రమాలు జరిగాయని టీడీపీ ప్రభుత్వం విచారణకు ఆదేశించిం ది. దీంతో విజిలెన్స్ అధికారుల బృందం ఇటీవల ఎంపీడీఓ నరేంద్రకుమార్‌ను విచారించినట్లు చెప్పారు. రెండోసారి క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులను విచారించడానికి వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, ఏఓ సూర్యనారాయణ, నవీన్, సతీష్ తదితరులున్నారు.

ఆవుకు ఒకే ఈతలో రెండు దూడలు


రెండు దూడలకు జన్మనిచ్చిన ఆవు

తనకల్లు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపల్లి గ్రామంలో సూర్యనారాయణరెడ్డికి చెందిన జెర్సీ ఆవు రెండు దూడలకు జన్మనిచ్చింది. ఆవు ప్రసవించడానికి(ఈనడానికి) ఇబ్బంది పడుతుండగా పశువుల వైద్య సహాయకుడు సుధాకర్‌నాయక్‌ను పిలిపించారు. ఆయన ఆవును పరిశీలించి, ఒక దూడ అడ్డం తిరిగినట్లు గుర్తించారు. తన చేతులతో చాకచక్యంగా ఆ దూడను బయటకు తీశాడు. మరో దూడను సాధారణంగానే ప్రసవించింది. రెండు దూడలు ఆరోగ్యంగా ఉన్నట్లు చెప్పారు. ఫోన్ చేసి సమాచారం అందించిన వెంటనే శుక్రవారం తెల్లవారుజామున 4గంటలకు గ్రామానికి చెరుకుని ఆవును, దూడలను కాపాడిన సుధాకర్‌నాయక్‌కు రైతు సూర్యనారాయణరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షలకు దరఖాస్తు చేసుకోండి

విద్యార్థులను కోరిన ఎస్కేయూ సీఈ డాక్టర్ లోకేష్

అనంతపురం సెంట్రల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): డిగ్రీ తృతీయ సంవత్సరం ఐదో సెమిస్టర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఇన్‌స్టంట్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఫీజులు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని ఎస్కేయూ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్(సీఈ) డాక్టర్ లోకేష్ తెలిపారు. పీజీ ప్రవేశాలకు, ఉద్యోగ దరఖాస్తులకు, ఇతర ప్రయోజనాలకు డిగ్రీ పాసైనట్లు సర్టిఫికెట్స్ అవసరం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఒక సబ్జెక్టు మిగిలిపోయిన విద్యార్థులందరికీ పరీక్షలు నిర్వహించి పాసైన వారికి డిగ్రీ సర్టిఫికెట్స్‌ను అందజేస్తామన్నారు. ఈనెల 8న కేఎస్ఎన్ ప్రభుత్వ బాలికల డిగ్రీ కళాశాలలో ఇన్‌స్టంట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పరీక్షా కేంద్రంలోనే ఫీజు చెల్లింపు

ఇప్పటి వరకు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోని విద్యార్థులకు పరీక్షలు రాసేలా వెసులుబాటు కల్పిస్తున్నామన్నారు. పరీక్షా కేంద్రం వద్దే రూ.2200 ఫీజును చెల్లించి పరీక్షలు రాయవచ్చునన్నారు. పరీక్షలు రాసే విద్యార్థులు వారి ఐదో సెమిస్టర్‌లో జారీచేసిన హాల్‌టికెట్స్‌ను తీసుకుని రావాలని సూచించారు. వివరాలకు 9440984416, 944028997 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

వీడియో చూపించి... బెదిరించి

(5వ పేజీ తరువాయి)

తన కూతురును పెళ్లి చేసుకోవాలని దళిత యువకుడిని ప్రాధేయపడింది. ఆ యువకుడు పెళ్లికి ఒప్పుకోలేదు. తనకు సంబంధం లేదని తేలిపోయాడు. పెళ్లి చేసుకోవాలని బలవంతం చేస్తే తాను ఊరు విడిచి ఎక్కడికైనా వెళ్లిపోతానని బెదిరించాడు. దీంతో ఆమె గ్రామంలో కొందరిని కలిసి, జరిగిన సంఘటన గురించి వివరించింది. తన కూతురు జీవితాన్ని కాపాడాలని వేడుకుంది. స్పందించిన గ్రామస్థులు కొందరు.. బాలికను పెళ్లి చేసుకోవాలని దళిత యువకుడిని బలవంతం చేశారు. దీంతో ఆ యువకుడు ఎవరికి చెప్పకుండా ఊరు విడిచివెళ్లిపోయాడు. నెల రోజులుగా ఈ తతంగం కొనసాగుతోంది.

రెండు పార్టీల వారి పాత్ర

బాలికపై అఘాయిత్యానికి పాల్పడినవారిలో రెండు ప్రధాన పార్టీ వారి పాత్ర ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ దారుణానికి పార్టీలతో సంబంధం లేకపోయినా, నిందితులు రెండు పార్టీల వారు కావడం చర్చనీయాంశమైంది. దళిత యువకుడు గ్రామం వదలివెళ్లడంతో ఈ సంఘటన బయటపడింది. దీంతో పోలీసులు శుక్రవారం బాధిత బాలికను, ఆమె తల్లిని కలిసి, పూర్తి సమాచారాన్ని సేకరించారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు, అభిషేక్ అనే యువకుడు ఈ దారుణంలో కీలక పాత్ర పోషించాడు. తన మిత్రులతో కలిసి బాలికను టార్గెట్ చేశాడు. ఇప్పటి వరకూ 13 మందిని గుర్తించి కేసు నమోదు చేశారు. మరో ఇద్దరు సహకరించారని, వారిపై కూడా కేసు నమోదు చేశారని సమాచారం. ఈ సంఘటనపై ఎస్పీ రత్న, ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్, రామగిరి సీఐ శ్రీధర్ లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఒకటిరెండు రోజుల్లో ఈ కేసు గురించి పూర్తి స్పష్టత వస్తుందని పోలీసులు అంటున్నారు.

బాలిక విషయంలోనూ నీచ రాజకీయాలా..?

ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం



అనంతపురం అర్బన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు ఇప్పటి దాకా శవాలను అడ్డం పెట్టుకుని నీచ రాజకీయాలు చేశారని, ఇప్పుడు అమాయకమైన బాలిక విషయంలోనూ వికృత రాజకీయాలు చేస్తున్నారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మండిపడ్డారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. కర్ణాటక సరిహద్దులోని ఒక గ్రామంలో బాలికపై అఘాయిత్యం చేసిన ఘటనలో టీడీపీ నేతలు ఉన్నారని, వారిని తాను వేనకేసుకొస్తున్నానని వైసీపీ కర పత్రికలో ప్రచురించడం సిగ్గుచేటని అన్నారు. ఎవరి ప్రోద్బలంతో ఇలాంటి వార్తలు రాస్తున్నారు..? కనీసం వివరణ తీసుకునే పద్ధతి లేదా అని ప్రశ్నించారు. ఈ ఘటన గురించి తనకు తెలిసిన వెంటనే పార్టీ, కులం, మతం చూడకుండా నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించానని తెలిపారు. బాలికపట్ల ఇంత దారుణంగా వ్యవహరించిన వారిని ఎవరైనా వెనకేసుకొస్తారా అని ప్రశ్నించారు. ఇలాంటి సంస్కార హీనమైన ఆరోపణలు ప్రచురించడం మానుకోవాలని హితవు పలికారు. ప్రస్తుతం ఈ కేసులో నలుగురిని అరెస్టు చేస్తే.. అందులో ఇద్దరు వైసీపీవారు ఉన్నారని, దీనికేం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. మనుషుల చావులతో ఎలాగూ రాజకీయాలు చేస్తున్నారని, కనీసం బాలికలు, మహిళలను వాడుకోకుండా ఉండాలని సూచించారు. ఈ ఘటనను ఎస్పీ సీరియస్‌గా తీసుకుని, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

బదిలీ వైద్యం..!

- ఫెవికాల్ సిబ్బంది కదలాల్సిందే..!
- 22 మంది వైద్యులు కూడా..
- డీఎంహెచ్ఓ బదిలీకి అవకాశాలు
- వైద్య ఆరోగ్యశాఖలో గుబులు


డాక్టర్ ఈబీ దేవి


రవికుమార్


డాక్టర్ వెంకటేశ్వరరావు

అనంతపురం టౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): వైద్యశాఖలో పలువురు అధికారులు, సిబ్బందికి బదిలీల గుబులు పట్టుకుంది. వైద్య ఆరోగ్యశాఖను గాడిలో పెట్టేందుకు సీఎం చంద్రబాబు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఏళ్ల తరబడి ఒకే చోట పనిచేస్తున్నవారిని ఖచ్చితంగా కదిలించాలని నిర్ణయించారు. ఈ విషయంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు పూర్తి అధికారాలు ఇచ్చినట్లు సమాచారం. బదిలీల ప్రక్రియను 20 రోజులలోపు పూర్తి చేయాలని ఉత్తర్వులు వచ్చాయి. దీంతో బదిలీల కోసం వైద్యాధికారులు, వైద్యులు, సిబ్బంది జాబితాలు సిద్ధమౌతున్నాయి. జిల్లా బోధనాస్పత్రిలో (మెడికల్ కళాశాల పరిధి) ఉన్న 22 మంది వైద్యులు తప్పనిసరిగా బదిలీ అవుతారని తెలిసింది. వీరిలో ముగ్గురు ప్రొఫెసర్లు, ఏడుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు, 12 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారని అధికారవర్గాలు తెలిపాయి. జిల్లా ఆస్పత్రి క్యాజువాలిటీలో పనిచేస్తున్న ముగ్గురు డాక్టర్లు తప్పనిసరిగా బదిలీ అవుతారని సమాచారం. వీరిలో కొందరు ఇక్కడే ఉండాలని ప్రయత్నాలు చేస్తున్నారు. మరికొందరు తమ సొంత ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు.

ఇక్కడిక్కడే తిరుగుతూ..

సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు కొందరు కొన్నేళ్ల నుంచి జిల్లా కేంద్రంలోనే తిష్ట వేశారు. మెడికల్ కాలేజీ నుంచి జిల్లా ఆస్పత్రికి, అక్కడి నుంచి డీఎంహెచ్ఓ కార్యాలయానికి, ఇక్కడి నుంచి మళ్లీ మెడికల్ కాలేజీకి పోస్టింగ్ తెచ్చుకుంటున్నారు. ఇలాంటివారి కారణంగానే వైద్యశాఖలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయనే ఆరోపణలు వస్తున్నాయి. వైద్యశాఖలోని అన్ని విభాగాలు తమ చేతుల్లో పెట్టుకుని.. అధికారులతో ఆడుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. అన్నీ తెలిసినా ఉన్నతాధికారులు వీరిని ఇక్కడిక్కడే బదిలీ చేస్తుండటం విస్మయం కలిగిస్తోంది. తాజా నిబంధనలతో వీరు ఖచ్చితంగా కదలాల్సి ఉంటుందని అంటున్నారు. కానీ వారు మాత్రం ఇక్కడే ఉండేందుకు పావులు కదుపుతున్నారు.

ఉన్నతాధికారులపైనా చర్చ

వైద్య ఆరోగ్యశాఖలో జిల్లా ఉన్నతాధికారుల బదిలీలపైనా జోరుగా చర్చ సాగుతోంది. డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి తప్పనిసరిగా బదిలీ అవుతారని అంటున్నారు. ఈమె వైసీపీ హయాంలో అప్పటి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సిఫార్సులతో ఇక్కడకు వచ్చారని ప్రచారం ఉంది. డీఎంహెచ్ఓ కార్యాలయంలో అవినీతి, అక్రమాలపై తీవ్ర విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆమె బదిలీ తప్పదన్న ప్రచారం జరుగుతోంది. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు బదిలీ అవుతారని అంటున్నారు. ముందు నుంచి అనేక ఆరోపణలు వస్తుండటం, మెడికోల మెస్ బిల్లులు, ఒకే డాక్టరు రెండుచోట్ల విధులు నిర్వహిస్తూ, రెండు జీతాలు పొందడం వంటి వివాదాల కారణంగా ఆయనను కదిలిస్తారనే అంటున్నారు. జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణకు ఏడాది గడువు ఉంది. దీంతో ఆయన ఇక్కడే ఉండే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. వైద్యవిధాన పరిషత్ శాఖ అధికారి (డీసీహెచ్ఎస్) రవికుమార్‌పై కలెక్టరుకు సదభిప్రాయం లేదు. ఓ ఆడియో హల్‌చల్ చేసిన విషయంలో ఆయన అడ్డంగా దొరికిపోయారు. అప్పటి నుంచి డీసీహెచ్ఎస్ పట్ల కలెక్టరు అసంతృప్తితో ఉన్నారు. ఆయన బదిలీ అవుతారనే చర్చ ఉన్నా.. జూలైలో ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ కారణంగా ఈ రెండు నెలలు ఇక్కడే ఉంచుతారని భావిస్తున్నారు.

ముంపు ముప్పు..!

(5వ పేజీ తరువాయి)


నడిమివంక కాలువలో పాములు వస్తున్నాయని చెబుతున్న ఐదో రోడ్డుకు చెందిన విజయదుర్గ

వెళ్తాయి. వర్షాల సమయంలో డ్రైనేజీలు పొంగి పొర్లితే లోతట్టు ప్రాంతాల్లోని కాలనీలు జలమయమవుతున్నాయి. అలాంటి సమయంలో నెలల కొద్దీ పూడిక తీయకపోతే మురికినీరంతా ఇళ్లలోకి చేరిపోతోంది. ఈ రెండు వంకలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచితే వరద నీటి ముప్పును తప్పించుకోవచ్చు. నడిమివంక పరిధిలోని 46వ డివిజన్‌లో ఐదో రోడ్డులోని పదోక్రాస్‌లో ఇమాంసాబ్ కాలువగా పిలుచుకునే 1వరోడ్డు నుంచి ఐదో రోడ్డు వరకు కలిసే డ్రైనేజీ దారుణంగా ఉంది. చుట్టుపక్కల నివాసముంటున్న ప్రజలు నిత్యం ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. దోమలు, పందుల స్వైరవిహారంతో రోగాల బారిన పడుతున్నారు. తాజాగా పాములు వచ్చాయని వారు వాపోతున్నారు. ఆ డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరినా అధికారులు పట్టించుకోలేదని వారు ఆవేదన చెందుతున్నారు. 48వ డివిజన్ పరిధిలోని నడిమివంకలో రజకనగర్, ఆర్కే నగర్ ప్రాంతాల్లో మురికి కాలువలో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయని కార్పొరేటర్ శ్రీనివాసులు.. కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

అటకెక్కిన పూడికతీత పనులు

నగరంలో చిన్న చిన్న కాలువల్లో పూడిక తీయడానికే నెలలు, ఏళ్ల సమయం పడుతోంది. ఓ ప్రాంతంలో ఒకసారి తీస్తే మళ్లీ పూడిక తీసే సరికి ఏడాది దాటి పోతోందట. ప్రధాన కాలువలైన మరువవంక, నడిమివంకలో పూడికతీత పనుల పరిస్థితి అలాగే ఉంది. వర్షాకాలం ప్రారంభమైనా నేటికీ పూడికతీత పనులు చేపట్టడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నెలరోజుల క్రితం దాదాపు రూ.50లక్షలతో టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్లు సైతం పనులు దక్కించుకున్నారు. పూర్తిస్థాయిలో పూడికతీత పనులు ఇంకా చేపట్టలేదు. వర్షాలొచ్చాక పూడికలు తీయడంకంటే ముందుగానే చేయడం ద్వారా వరదనీరు బయటకు రాకుండా ఉంటుంది. ఆ రెండు వంకల్లో పూడిక విపరీతంగా పేరుకుపోయింది. కొన్ని కాలనీల పరిధిలో ఉండే చిన్న కాలువల్లో సైతం పూడిక తీయిస్తేనే ఉపయోగం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధికారులు ఇప్పటికైనా పూడిక తీయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

510 ఆక్రమణలు

మరువవంక, నడిమివంకను ఆక్రమించి కట్టిన నిర్మాణాలు 510 ఉన్నాయి. నడిమివంక పరిధిలో 240, మరువవంకపై 270 వరకు ఆక్రమణలున్నట్లు తేలింది. వంకల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని అనంతపురం ఎమ్మెల్యే సూచించారు. ఆ క్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు 510 ఆక్రమణలున్నట్లు తేల్చి, నోటీసులు జారీచేశారు. అక్కడితో ఆపేశారు. రాజకీయ ఒత్తిళ్లు వచ్చిన క్రమంలో కొన్ని నెలలు ఆ ప్రక్రియకు ఫుల్‌స్టాప్ పడిందనే ప్రచారం జరిగింది. ఆ తరువాత నగర పాలక సంస్థ టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు విచారించి, ఆక్రమణలపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఆ ఊసే లేదు. ఆక్రమణలు తొలగించకపోతే రానున్న వర్షాకాలంలో అనంత ప్రజలకు వరద ముప్పు తప్పేలా లేదు.

త్వరలో పూర్తిచేస్తాం

మరువవంక, నడిమివంకల్లో పూడికతీత పనులకు టెండర్లు పిలిచాం. ప్రధానంగా ఎక్కువ పూడిక ఉన్న ప్రాంతాల్లో పనులు చేపడుతున్నాం. త్వరలోనే అన్ని ప్రాంతాల్లో పూడిక తీయిస్తాం. వంకల ఆక్రమణపై ఇదివరకే నోటీసులిచ్చారు.

-షాకీర్, ఈఈ, నగరపాలక సంస్థ

వడ్డీ జలగలు

(5వ పేజీ తరువాయి)

దోచుకుంటున్నారు. అప్పులు తీసుకున్న వారితో ప్రాంసరినోటు, చెక్కులు రాయించుకుంటారు. అలాగే ఆస్తుల ఒరిజినల్ డాక్యుమెంట్లను కూడా స్వాధీనం చేసుకుంటున్నారు. అప్పులు చెల్లించకపోతే వడ్డీలకు వడ్డీలు వేసి వారి ఆస్తులు కూడా తమ పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు.

మైక్రో జోలికి వెళ్లవద్దు: నరసయ్య, పీడీ, డీఆర్‌డీఏ

జిల్లాలోని ప్రజలు మైక్రో ఫైనాన్స్ సంస్థల్లో అప్పులు తీసుకోవద్దని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య సూచించారు. ప్రజలు, మహిళలకు రుణాలు సమకూర్చడానికి డీఆర్‌డీఏ ఉద్యోగులు అందుబాటులో ఉంటారు. డ్వాక్రా సంఘాల ద్వారా ఇప్పటికే పావలా వడ్డీకి రుణాలు ఇస్తున్నాం. వ్యక్తిగత రుణాలు అవసరమైన వారికి స్త్రీనిధి బ్యాంకు ద్వారా రుణాలు ఇస్తాం. ప్రజలు మైక్రోఫైనాన్స్‌లో అప్పులు తీసుకుని ఇబ్బంది పడకుండా అవగాహన కల్పిస్తున్నాం.

ఉపాధి బకాయిలు రూ.190 కోట్లు


పనిచేసే చోట మస్టర్లు నమోదు చేయించుకుంటున్న ఉపాధి కూలీలు

(5వ పేజీ తరువాయి)

ఉండాలి. ఆర్థిక సంవత్సరం ఆఖరు కావడంతో ఫిబ్రవరి, మార్చి నెలల్లో మెటీరియల్ వర్క్ ఎక్కువగా చేశారు. దీంతో ఉపాధి కూలీల వేతన బిల్లుల కంటే మెటీరియల్‌వే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించిన తరువాతే మెటీరియల్ కాంపోనెంట్ బిల్లులు ఇవ్వాల్సి ఉంటుంది. ఎప్పుడిస్తారోనని పనులు చేసిన కాంట్రాక్టర్లు, లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

వేతన వెతలు

ఉపాధి సిబ్బందికి ఐదు నెలలుగా వేతనాలు పడలేదు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఏపీడీలు, ఏపీఓలు, టీఏ, ఈసీ, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పనిచేస్తున్నారు. వాటర్‌షెడ్‌లో ఏపీడీ, పీఓ, ఇంజనీర్లు, టీఓ, ఫీల్డ్ సిబ్బంది పనిచేస్తున్నారు. మొత్తం డ్వామాలో వెయ్యిమందికిపైగా పనిచేస్తున్నారు. ఫిబ్రవరి నుంచి జీతాలు పడలేదని వాపోతున్నారు. వెంటనే జీతాలు చెల్లించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

టార్గెట్ల ఒత్తిడి

కూలీలకు వేతనాలు, తమకు వేతనాలు పెండింగ్‌లో పెట్టి పనుల టార్గెట్లు పూర్తి చేయాలని ఒత్తిడి చేయడం పట్ల ఉపాధి సిబ్బంది అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి పనులకు పిలిస్తే జాబ్‌కార్డుదారులు బకాయిలు చెల్లిస్తే వస్తామని కరాఖండిగా చెబుతున్నారని ఉపాధి ఉద్యోగులు వాపోతున్నారు. పనులు పెట్టకపోతే అధికారులు టార్గెట్ల పేరుతో తీవ్ర ఒత్తిడి చేస్తున్నారనీ, మరోవైపు ఉపాధి సిబ్బంది తలలు బాదుకుంటున్నారు. ఉపాధి నిర్మాణాల పనులు చేయించాలన్నా ఆరు నెలలుగా మెటీరియల్ కాంపోనెంట్ బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయి. ఏది ఏమైనా ఉపాధి పథకం బిల్లులు బకాయిలు పేరుకుపోవడం, ఉపాధి సిబ్బంది వేతనాలు ఐదో నెల కూడా పడకపోవడం గమనార్హం.

త్వరలో జమవుతాయి

ఉపాధి కూలీలకు బిల్లులు మంజూరయ్యాయి. త్వరలోనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తాం. మెటీరియల్ కాంపోనెంట్, ఉద్యోగుల వేతనాలకు సంబంధించిన బిల్లులన్నీ త్వరలోనే చెల్లించనున్నట్లు రాష్ట్ర అధికారుల నుంచి సమాచారం అందింది. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఉపాధి సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలని సూచిస్తున్నాం. ఏ ఒక్క జాబ్‌కార్డుదారుడు స్థానికంగా పనులు లేవని వలస వెళ్లకుండా చూడాలని ఇప్పటికే ఆదేశాలిచ్చాం.

-సలీంబాషా, డ్వామా పీడీ

రాత్రి వరకు కౌన్సెలింగ్..!

(5వ పేజీ తరువాయి)

తర్వాత మొదలుపెట్టారు.

స్వల్ప వాగ్వాదాలు

మున్సిపల్ కార్పొరేషన్‌లో 52 పోస్టులు, మున్సిపాలిటీల్లో 304 పోస్టులు, ప్రభుత్వ యాజమాన్యంలో 3 పోస్టులకు 1:2 నిష్పత్తిలో ప్రమోషన్ల కౌన్సెలింగ్ నిర్వహించారు. మున్సిపాలిటీ, కార్పొరేషన్ పోస్టుల కౌన్సెలింగ్ సమయంలో రోస్టర్ సక్రమంగా పాటించడం లేదన్న విషయంపై ఉపాధ్యాయుల మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. ఎస్సీ వర్గీకరణ మేరకు రోస్టర్ భర్తీ చేయాలన్న అంశంపై రాత్రి కూడా కొంత సమస్య ఉత్పన్నమైంది. దీంతో అక్కడికి చేరుకున్న ఆర్‌జేడీ శామ్యూల్, రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించారు. కౌన్సెలింగ్ సజావుగా సాగేలా చూశారు.

జడ్పీ టీచర్లకు తిప్పలు

జిల్లా పరిషత్ మేనేజ్‌మెంట్‌లో 304 స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ల కోసం 1:3 నిష్పత్తిలో ఎస్‌జీటీలను సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పలిచారు. శారదాస్కూల్‌లో మధ్యాహ్నం వరకూ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారు. రాయదుర్గం, హిందూపురం, అమరాపురం, తాడిపత్రి, కదిరి తదితర ప్రాంతాల నుంచి టీచర్లు వచ్చారు. పోస్టింగ్‌ల కోసం సాయంత్రం ప్రారంభం కావాల్సిన కౌన్సెలింగ్ రాత్రి 9.30 గంటలకు మొదలైంది. కొంతసేపు సజావుగా సాగినా... రాత్రి వరకూ కౌన్సెలింగ్ కొనసాగడంతో విమర్శలు వచ్చాయి. తమకు కనీస వసతులు లేవని 10.30 గంటల సమయంలో మహిళా టీచర్లు నిరసన తెలిపారు. కనీసం తాగడానికి నీరు లేదని, వాష్‌రూమ్స్ లేక ఇబ్బంది పడుతున్నామని మండిపడ్డారు.


శారదాస్కూల్ ఆవరణలో టీచర్లు, వాళ్ల బంధువుల నిరీక్షణ

సత్యసాయి ప్రేమతత్వం.. అనన్యం

మహిళా సదస్సులో జస్టిస్ అనన్య


ప్రసంగిస్తున్న కోల్‌కతా హైకోర్టు జడ్జి జస్టిస్ అనన్యబందోపాధ్యాయ

పుట్టపర్తి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయిబాబా అందించిన ప్రేమతత్వం అనన్యమంటూ కోల్‌కతా హైకోర్టు జడ్జి జస్టిస్ అనన్య బందోపాధ్యాయ కొనియాడారు. ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంతులో శ్రీసత్యసాయి మహిళా సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. మొదట మహిళాప్రతినిధులు జ్యోతి ప్రజ్వలన చేయగా, వేదపఠనంతో సదస్సు ప్రారంభమైంది. అనంతరం కోల్‌కతా హైకోర్టు జడ్జి ప్రసంగిస్తూ సత్యసాయి అందించిన ప్రేమతత్వం, మానవాళిని శాంతి జీవనం వైపు పయనించేలా చేస్తోందన్నారు. సత్యసాయి బోధనలు సామాజిక సేవలు ప్రపంచ మానవాళికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. మహిళలు సామాజిక సేవలో తమ బాధ్యతను ఎంతో నిబద్ధతగా నిర్వహిస్తున్నట్టు జడ్జి పేర్కొన్నారు. సాయంత్రం హిమాచల్ ప్రదేశ్ హోంగార్డ్స్ అడిషనల్ డీజీ సత్వంత్ అత్వల్ మహిళా ప్రతినిధులు అపర్ణ తివారి, నీటాకన్నా ప్రసంగించారు. అనంతరం వాయిద్యగాన కచేరీని నిర్వహించారు. మొదటి రోజు సదస్సుకు వేలాది మంది మహిళాప్రతినిధులు హాజరయ్యారు.

నాసిన్‌లో కేంద్ర మంత్రి


కేంద్ర మంత్రితో పయ్యావుల కేశవ్, సవిత, పార్థసారథి

గోరంట్ల, జూన్ 6(ఆంధ్రజ్యోతి): నాసిన్‌కు శుక్రవారం వచ్చిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను రాష్ట్ర ఆర్థిక మంత్రి పయావుల కేశవ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎంపీ పార్థసారథి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ తదితరులు కలిశారు. జ్ఞాపికలు, పుష్పగుచ్ఛాలు ఇచ్చి సత్కరించారు. నాసిన్ ఆకాడమీ అభివృద్ధిని పరిశీలించేందుకు కేంద్ర మంత్రి వచ్చారు. విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణ, కరువు నివారణ చర్యలు, తోట పంటల సాగు తదితర అంశాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న తదితరులు పాల్గొన్నారు.

ఐదు రోజులు తేలికపాటి వర్షాలు

బుక్కరాయసముద్రం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రానున్న ఐదు రోజులు తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి తెలిపారు. అనంతపురం జిల్లాలో ఈ నెల 7న 0.2 మి.మీ., 8న 0.7, 9న 1.6 మి.మీ. 10న 12.9 మి.మీ., 11న 4.3 మి.మీ. వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఈ నెల 7న 1.0 మి.మీ., 8న 1.0, 9న 2.2 మి.మీ., 10న 9.2 మి.మీ., 11న 4.4 మి.మీ. వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 36-37 డిగ్రీలు సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 24.6,-26.2 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చునని తెలిపారు. నైరుతి దిశగా గాలులు గంటకు 12-20 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉందని అన్నారు.

క్రైం కార్నర్

అప్పుల ఉరికి వేలాడిన అన్నదాత



రామాంజనేయులు (ఫైల్)

కూడేరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్రకోడు గ్రామానికి చెందిన రైతు రామాంజనేయులు అప్పులబాధతో గురువారం రాత్రి ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రైతు రామాంజనేయులు తనకున్న ఐదెకరాల పొలంలో వేరుశనగ, మొక్కజొన్న, టమోటా పంటలు సాగు చేస్తుండేవాడు. అతివృష్టి, అనావృష్టితో పంటలు సాగుకు పెట్టిన పెట్టుబడులు రాక తీవ్రంగా నష్టపోయాడు. అప్పులు రూ.6 లక్షలు అయ్యాయి. వాటిని చెల్లించే మార్గం కనిపించక ఆవేదన చెందుతుండేవాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి కుటుంబ సభ్యులు ఇంట్లోనే నిద్రపోతుండగా రామాంజనేయులు మరో గదిలోకి వెళ్లి చీరతో ఉరేసున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున గమనించిన కుటుంబ సభ్యులు గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి చూడగా అప్పటికే మృతిచెందాడు. శవాన్ని కిందికి దించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, వివరాలను సేకరించారు. రైతు భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి, శవాన్ని పోస్టు మార్టంకి తరలించారు. రైతుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

జీవితంపై విరక్తి చెంది మహిళ..

సోమందేపల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): స్థానిక రాంబాబు కాలనీకి చెందిన ఈశ్వరమ్మ (47) జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈశ్వరమ్మ భర్త నాగభూషణం చేనేత కార్మికుడు. వయోభారంతో పనిచేతకాక పింఛన్‌పై ఆధారపడి బతుకుతున్నారు. వీరికి సాయి నరసింహులు అనే కుమారుడున్నాడు. అతడు కొత్త కొట్టాలలో చేనేత కార్మికుడిగా పనిచేస్తున్నాడు. దంపతులు.. రోజూ కొడుకు వద్ద భోజనం చేసి రాత్రి ఇంటికి వచ్చి నిద్రించేవారు. శుక్రవారం ఎవరూలేని సమయంలో ఈశ్వరమ్మ ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఆమె మానసిక స్థితి బాగోలేదని స్థానికులు చెబుతున్నారు. మృతదేహాన్ని పెనుకొండ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

రస్తా విషయంలో దాడి

● నలుగురు టీడీపీ కార్యకర్తలకు గాయాలు

యల్లనూరు, జూన్6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాగుండ్ల పంచాయతీలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో రస్తా విషయంలో టీడీపీ కార్యకర్తలపై వైసీపీకి చెందిన వారాది వర్గీయులు దాడిచేశారు. ఈ దాడుల్లో నారాయణస్వామితోపాటు మరో నలుగురు గాయపడ్డారు. లింగారెడ్డిపల్లికి చెందిన నారాయణస్వామికి మల్లాగుండ్ల పొలంలో భూమి ఉంది. ఈ పొలానికి వెళ్లే రహదారి విషయంలో మల్లాగుండ్లకు చెందిన వారాది శుక్రవారం సాయంత్రం నారాయణస్వామితో గొడవపడ్డారు. ఈ గొడవ కాస్త పెద్దదై నారాయణస్వామి అన్నదమ్ములపై వారాది మరో ఏడుగురితో కలిసి కట్టెలతో దాడిచేశారు. ఈ దాడిలో రామాంజనేయులు, నారాయణస్వామి, రాజమల్లు, ఓబులేసులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని తాడిపత్రి ఆసుపత్రికి తరలించారు. నారాయణస్వామి ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయులరెడ్డి తెలిపారు.

కొత్తిమీర పంటను కోసుకెళ్లిన దుండగులు



గుర్తుతెలియని వ్యక్తులు కోసుకెళ్లిన కొత్తిమీర పంట

చిలవత్తూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కొత్తిమీర పంటకు మార్కెట్లో ధర బాగా ఉండటంతో గుర్తుతెలియని వ్యక్తులు అర ఎకరంలో పంటను గురువారం రాత్రి కోసుకెళ్లారు. మండలంలోని తుమ్మలకుంట గ్రామానికి చెందిన రైతు ఆదినారాయణప్ప తనకున్న అర ఎకరం పొలంలో కొత్తిమీర పంటను సాగు చేశాడు. కోతకు సిద్ధంగా ఉన్న పంటను గుర్తుతెలియని వ్యక్తులు ఇలా రాత్రికి రాత్రే కోసుకెళ్లడంతో బాధిత రైతు లబోదిబోమంటున్నాడు. జాతీయ రహదారికి అతి సమీపంలో ఉన్న పొలంలో ఇలా పంటను కోసుకెళ్లడం గమనార్హం. ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారం సుమారు రూ. లక్ష నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు పేర్కొన్నాడు.

మహిళ అదృశ్యం



సరస్వతి (ఫైల్)

కళ్యాణదుర్గం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎర్రనేల వీధిలో నివాసం ఉంటున్న సరస్వతి అనే మహిళ ఈ నెల 5న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు శుక్రవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చుట్టుపక్కల కాలనీల్లోను, బంధువుల ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆ మహిళ ఎక్కడైనా కనిపిస్తే 7386400113, 9490106284 అనే నెంబర్లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

బాల్య వివాహంపై కేసు

యాడికి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనరామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద శుక్రవారం జరిగిన బాల్యవివాహంపై అధికారులు కేసు నమోదు చేశారు. యాడికి మండలం ఈరన్నపల్లి గ్రామానికి చెందిన యువకుడికి, గుంతకల్లు రూరల్ మండలంలోని గ్రామానికి చెందిన బాలికకు శుక్రవారం వివాహం జరిపారు. దీనిపై చైల్డ్‌లైన్ నెంబరు 1098కు ఫిర్యాదు అందింది. 1098కాల్ సెంటర్ నుంచి స్థానిక అధికారులను అప్రమత్తం చేశారు. ఐసీడీఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శి, పోలీసు సిబ్బంది కోన రామలింగేశ్వరస్వామి ఆలయం వద్దకు వెళ్లే సమయానికే వివాహం జరిగిపోయింది. దీంతో వరుడితోపాటు బాలికను వారి తల్లిదండ్రులను, వివాహం జరిపించిన పెద్దలను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. బాలికను వారి తల్లిదండ్రులతో పంపించేశారు. బాల్యవివాహంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్డీటీ సేవలు ఆగవు

మంత్రి నారా లోకేశ్ అభయం

● కేంద్రంతో నిరంతర సంప్రదింపులు

● త్వరలో ఫలించే అవకాశం



అనంతపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రాయలసీమతోపాటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో గ్రామీణుల అభివృద్ధి కోసం పనిచేస్తున్న ఆర్డీటీ సేవలు నిరంతరంగా కొనసాగేందుకు రాష్ట్ర ఐటీ, విద్య శాఖ మంత్రి నారాలోకేశ్ కృషి చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వంతోనూ, సంబంధిత ఉన్నతాధికారులు, సంస్థలతోనూ సంప్రదింపులు సాగిస్తున్నారు. విద్య, వైద్యం, విజ్ఞానం, ఉపాధి, వికాస రంగాల ద్వారా తెలుగు రాష్ట్రాల్లో పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్న ఆర్డీటీ సేవలు పూర్తి స్థాయిలో పునరుద్ధరించేందుకు మంత్రి లోకేశ్ చేస్తున్న ప్రయత్నాలు కొలిక్కివస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ వర్గాల ద్వారా అందిన సమాచారం. త్వరలోనే ఆర్డీటీ సేవలు, కార్యకలాపాలు యథావిధిగా సాగే అవకాశం ఉందని ఆ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఆర్డీటీకి విదేశాల నుంచి నిధుల వినియోగాన్ని ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్టు (ఎఫ్‌సీఆర్‌ఏ) కింద కేంద్రం నిలిపివేసింది. దీంతో ఆ నిధులను ఆర్డీటీ వినియోగించేందుకు వీలులేకుండా పోయిన విషయం తెలిసిందే. లోకల్ కాంట్రిబ్యూషన్ ఖాతాలోని నిధులనే సేవా కార్యక్రమాలకు వాడాల్సి వస్తోంది. ఫలితంగా అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాలతోపాటు తెలంగాణలోని మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో ఆర్డీటీ చేపడుతున్న విద్య, వైద్యం, స్వయం ఉపాధి కార్యక్రమాలు నిలిచిపోయే ప్రమాదం ఏర్పడిందనేది నిర్వివాదాంశం. ఉమ్మడి అనంత జిల్లాలో సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. యువగళం పాదయాత్ర సమయంలో ఆర్డీటీ సేవా కార్యక్రమాలను నారా లోకేశ్ ప్రత్యక్షంగా చూసిన విషయం తెలిసిందే. ఆర్డీటీ కార్యాలయాన్ని సంప్రదించడంతోపాటు సంస్థ నిర్వాహకులు అన్నె ఫెర్రర్, మాంచో ఫెర్రర్‌తో మాట్లాడారు. ప్రభుత్వంతో సమాంతర ంగా విద్య, వైద్యం, ఉపాధి రంగాల ద్వారా పేదలకు ఆర్డీటీ అందిస్తున్న నిస్వార్థ సేవలను ఆయన ప్రత్యక్షంగా చూసిన నేపథ్యంలో... తాము అధికారంలోకి వచ్చాక ఆర్డీటీ సేవలు విస్తరించేందుకు అన్ని విధాలుగా సాయం అందిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఆర్డీటీ నిర్వాహకుడు మాంచో ఫెర్రర్.. మంత్రి నారా లోకేశ్‌ను కలవడం, పరిస్థితిని వివరించిన విషయం తెలిసిందే. సంస్థ ద్వారా సేవలు మరింత విస్తరించేందుకు సహకారం ఇవ్వాలని కోరగా.. ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఇస్తామని లోకేశ్ భరోసా ఇచ్చిన విషయం విదితమే. ఆర్డీటీ నిర్వహిస్తున్న ఆస్పత్రుల నుంచి వస్తున్న ఆదాయాన్ని ఎఫ్‌సీ ఖాతాలో కాకుండా ఎల్‌సీ ఖాతాలో జమ చేశారనే అభియోగంపై కేంద్రం ఎఫ్‌సీఆర్‌ఏ వినియోగానికి అనుమతులు నిరాకరించింది. ఆర్డీటీకి వస్తున్న నిధులను ఇతర ఎన్జీఓలు చేపట్టే కార్యక్రమాలకు వెచ్చిస్తున్నారనే ఆరోపణలతో ఆంక్షలు విధించడంతో ఆర్డీటీ సేవలు ప్రశ్నార్థకమయ్యాయి. రాయలసీమ, తెలంగాణ రాష్ట్రంలోని 3,500 గ్రామాల్లో ఆర్డీటీ సేవలు అందిస్తోంది. బత్తలపల్లి, కళ్యాణదుర్గం, కణేకల్లు ప్రాంతాల్లో 600కిపైగా పడకలతో మూడు ఆస్పత్రులను ఆర్డీటీ నిర్వహిస్తున్న నేపథ్యంలో ఏటా లక్షలాది మంది అవుట్ పేషెంట్లు, వేలాదిమంది ఇన్‌పేషెంట్లకు సేవలు అందిస్తోంది. కరోనా సమయంలోనూ బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రిని కొవిడ్ సెంటర్‌గా మార్పు చేసి 10వేల మందికి చికిత్స అందించారు. మూగ, చెవిటి, మానసిక దివ్యాంగ విద్యార్థులకు పాఠశాలలు నిర్వహిస్తోంది. కేంద్రం ఆంక్షలతో ప్రస్తుతం ఆ సేవలన్నీ నిలిచిపోయే ప్రమాదం ఏర్పడింది. కష్టకాలంలో ఉన్న ఆర్డీటీని ఆదుకోవడమేకాకుండా ఆ సంస్థ ద్వారా సేవలను మరింత విస్తృత పర్చడంలో భాగంగా మంత్రి నారాలోకేశ్ ఆ సంస్థకు ఇచ్చిన మాటను నిలబెట్టుకునే దిశగా కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఆర్డీటీ సేవలకు ఎదురైన అడ్డంకులన్నీ తొలగిపోయి, మళ్లీ యథావిధిగా కొనసాగేలా మంత్రి నారాలోకేశ్ చేస్తున్న కృషి ఫలించనుందని ప్రభుత్వ పెద్దల ద్వారా అందిన సమాచారం.

కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు

● పదవులకు వన్నెతెచ్చేలా పనిచేయాలి

● ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే పరిటాల సునీత

● అట్టహాసంగా రాప్తాడు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత



మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణస్వీకారం చేస్తున్న బోయపాటి సుధాకర్‌చౌదరి

అనంతపురం రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు దక్కుతుందని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. మండలంలోని కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో రాప్తాడు వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం ప్రమాణస్వీకారోత్సవం శుక్రవారం అట్టహాసంగా సాగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్ హాజరయ్యారు. ముందుగా కక్కలపల్లి క్రాస్ నుంచి ముఖ్య అతిథులతో పాటు మార్కెట్ యార్డు పాలక వర్గసభ్యులు ర్యాలీగా వచ్చారు. టీడీపీ శ్రేణులు వారికి ఘన స్వాగతం పలికాయి. మార్కెట్ కార్యదర్శి రాంప్రసాద్ యార్డు చైర్మన్‌గా సుధాకర్ చౌదరి, వైస్ చైర్మన్‌గా గంగులకుంట క్రిష్టతోపాటు డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎంపీ బీకే పార్థసారథి మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్ర పాలనను అస్తవ్యస్తం చేసిందన్నారు. అప్పులతో అవస్థల్లో ఉన్న రాష్ట్రాన్ని ముఖ్య మంత్రి చంద్రబాబు తన పాలనా దక్షతతో గాడిలో పెడుతున్నారన్నారు. రాప్తాడు మార్కెట్ యార్డు పరిపాలన భవన నిర్మాణానికి రూ.25లక్షల ఎంపీ నిధులు కేటాయిస్తామన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ మార్కెట్ కమిటీలో స్థానం దక్కిన ప్రతి ఒక్కరూ ఆ పదవులకు వన్నెతేచ్చేవిధంగా పనిచేయాలన్నారు. గతంలో ఎక్కువమంది పోటీ ఉండటం వలన చివరి వరకు కమిటీ ఏర్పాటు కాలేదన్నారు. చివర్లో పదవులు ఇచ్చినా సమయం తక్కువగా ఉండటం వలన సరిగా పని చేయలేకపోయారన్నారు. రైతులకు ఉపయోగపడే విధంగా పనిచేయాలన్నారు. ప్రతి మూడు నెలలకోసారి సమావేశాలు నిర్వహించి రైతులకు ఏమికావాలన్నది తమ దృష్టికి తీసుకొస్తే కచ్చితంగా వాటిని ఎంపీ సాయంతో ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో విస్తృతంగా పంట సాగు ఉందని అయితే ఎంత ఖర్చు పెట్టి పంటలు సాగుచేసినా సరైన గిట్టుబాటు ధరలు లేక రైతులు నష్టపోతున్నారన్నారు ఇలాంటి సమయంలో మార్కెట్ కమిటీ సభ్యులు చొరవతీసుకుని రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ఎన్నికల ముందు జగన్‌ని గద్దె దించేందుకు ఏవిధంగా పోరాటం చేశారో ఇప్పుడు రైతుల కోసం అదే తరహాలో పనిచేయాలన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ సుధాకర్ చౌదరి మాట్లాడుతూ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తనకు అవకాశం దక్కడం సంతోషంగా ఉందన్నారు. రైతులకు సేవచేయడానికి తనకు అవకాశం దక్కిందన్నారు. ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే పరిటాల సునీత సహకారంతో రైతులకు అన్నివిధాల న్యాయం జరిగేలా చూస్తామన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను గజమాలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, టీడీపీ మండల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌లో నిధుల దుర్వినియోగాన్ని సహించం..

● కరోనా జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పించండి

● రైతులకు విత్తనాలు సకాలంలో అందించండి

● జడ్పీ స్టాండింగ్ కమిటీ భేటీలో చైర్‌పర్సన్, సభ్యులు



పీడీపై అసహనం వ్యక్తంచేస్తున్న చైర్‌పర్సన్, అధికారులు

అనంతపురం విద్య, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ (ఐసీడీఎస్)లో నిధుల దుర్వినియోగాన్ని సహించబోమని జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జడ్పీటీసీలు హెచ్చరించారు. స్థానిక జడ్పీలో శుక్రవారం స్టాండింగ్ కమిటీ సమాశాలు నిర్వహించారు. వ్యవసాయం, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, వైద్యం అంశాలపై చర్చ జరిగింది. వర్షాలు పడుతున్నాయనీ, రైతులకు విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించాలని సభ్యులు.. అధికారులను కోరారు. రైతులను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. ఐసీడీఎస్ కార్యాలయాన్ని ఐఎస్ఓ ప్రమాణాల కోసం ఆధునీకరిస్తే... దానిని వెంటనే తొలగించడం సరికాదన్నారు. దీంతో నిధులు దుర్వినియోగమయ్యాయంటూ జడ్పీ చైర్‌పర్సన్, జడ్పీటీసీ జయరాం.. ఐసీడీఎస్ పీడీపై అసహనం వ్యక్తం చేశారు. పోషణ్ పక్వాడా నిధుల్లో సైతం గోల్‌మాల్ జరిగిందంటూ మండిపడ్డారు. చాలా అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత పాటించడం లేదనీ, కరోనా వ్యాప్తి నేపథ్యంలో పిల్లలు అనారోగ్యం బారినపడకుండా చూడాలని ఆదేశించారు. రాయదుర్గం, గోరంట్ల, గుమ్మఘట్ట జడ్పీటీసీలు మాట్లాడుతూ.. కరోనా వ్యాప్తిపై ప్రజల్లో అవగాహన పెంచాలంటూ డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. మండలాలకు శానిటైజర్, మాస్కులు పంపిణీ చేయాలన్నారు. విలేజ్ క్లినిక్‌లను ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య, వైస్ చైర్‌పర్సన్ నాగరత్న, జడ్పీటీసీలు, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు బక్రీద్

● ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ఏర్పాట్లు

● కొండెక్కిన పొట్టేళ్ల ధరలు

అనంతపురం కల్చరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ముస్లింల ప్రధాన పండుగల్లో బక్రీద్ ఒకటి. త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్‌ను శనివారం చేసుకోనున్నారు. రంజాన్ పర్వదినం ముగిసిన 70 రోజుల తర్వాత ముస్లింలు బక్రీద్ జరుపుకోవడం ఆనవాయితీ. బక్రీద్ పండుగకు ముందురోజునే ముస్లింలు మరణించిన తమ వారి సమాధుల వద్ద వారికి ఇష్టమైన దుస్తులు, ఆహార పదార్థాలను ఉంచుతారు. వారు స్వర్గం నుంచే వాటిని స్వీకరిస్తారని విశ్వాసం. పండుగ నేపథ్యంలో ధనికులైన ముస్లింలు పొట్టేలు మాంసాన్ని పేదలకు కుర్బానీ పేరుతో వితరణ చేయడం ఆనవాయితీ. రంజాన్ పండుగలాగానే బక్రీద్ నాడు ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. బక్రీద్ నేపథ్యంలో శనివారం నిర్వహించే సామూహిక ప్రార్థనలకోసం జిల్లాలోని ఈద్గాలు, మసీదులు సిద్ధమయ్యాయి. కాగా ప్రాంతాలవారీగా మసీదుల్లో 6.30 గంటల నుంచి ప్రార్థనలు ప్రారంభమవుతాయి. హెచ్చెల్సీ కాలనీ ఈద్గాలో 9 గంటలకు, హౌసింగ్‌బోర్డులో 9.30కి ప్రార్థనలు నిర్వహించనున్నట్లు మతపెద్దలు పేర్కొంటున్నారు. ఆయా ప్రాంతాల్లో వజూ చేసుకునేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

కొండెక్కిన పొట్టేళ్ల ధరలు

బక్రీద్‌ను పురస్కరించుకుని వారం రోజుల ముందు నుంచే పొట్టేళ్ల అమ్మకాలు ఊపందుకున్నాయి. ఒక్కో పొట్టేలు రూ.10వేల నుంచి రూ.లక్ష వరకు ధర పలికాయి. బక్రీద్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని చాలామంది పొట్టేళ్లను ప్రత్యేకంగా పెంచి విక్రయిస్తుంటారు. శుక్రవారం అనంతపురం నగరంలోని నడిమివంక వద్ద పొట్టేళ్ల విక్రయాలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పొట్టేళ్లను తీసుకువచ్చి విక్రయించారు. దీంతో పొట్టేళ్ల ధరలు కొండెక్కాయి. సాధారణ రోజుల్లో 15 కిలోల బరువు ఉండే పొట్టేలు ధర రూ.12వేలు ఉండగా.. బక్రీద్ డిమాండ్ నేపథ్యంలో అది రూ.20వేలకు చేరుకుంది. పండుగకు కుర్బానీ సంప్రదాయం కావడంతో ధర ఎక్కువైనా ముస్లింలు పొట్టేళ్లను కొని తీసుకెళ్లడం కనిపించింది.

నడిమివంక వద్ద పొట్టేళ్ల విక్రయాలు



అన్నింటికీ అపార్ అవసరం

● జేఎన్‌టీయూ డీఈ నాగప్రసాద్ నాయుడు



అవగాహన సదస్సులో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

అనంతపురం సెంట్రల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థీ అపార్ నమోదు చేసుకోవాలని జేఎన్‌టీయూ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్(డీఈ) ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు సూచించారు. అపార్ ఐడీ రూపకల్పపై వర్సిటీలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు మాట్లాడుతూ.. ఆధార్ తరహాలో ప్రతి విద్యార్థికీ అపార్ ఐడీ ఉపయోగపడుతుందన్నారు. ఎల్‌కేజీ నుంచి పీజీ, పీహెచ్‌డీ వరకు సర్టిఫికెట్లన్నింటినీ అపార్‌లో భద్రపరచుకోవచ్చన్నారు. http-s://a-paar.education.gov.in/ వెబసైట్‌లోగానీ ప్లేస్టోర్‌లో అపార్ యాప్‌ద్వారాగానీ విద్యార్థులు ఆధార్ నంబరుతో ఐడీని క్రియేట్ చేసుకోవాలని సూచించారు. విద్యార్హత సర్టిఫికెట్లతోపాటు ఓటరు, డ్రైవింగ్ లైసెన్స్, కుల, ఆదాయ ధృవీకరణ తదితర పత్రాలు అపార్‌లో పొందుపరచుకోవచ్చన్నారు. ప్రస్తుత డిజిటల్ ప్రపంచంలో ఎక్కడికెళ్లినా అపార్‌లోని సర్టిఫికెట్లు చెల్లుబాటు అవుతాయని వివరించారు. వర్సిటీ పరిధిలోని కళాశాలలన్నీ విద్యార్థులతో తప్పకుండా అపార్ ఐడీలను క్రియేట్ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో డిజిటల్ ఇండియా కార్పొరేషన్ రీజనల్ కోఆర్డినేటర్ రవి పాండ్యన్, ఉన్నత విద్యామండలి అధికారులు అనిల్‌కుమార్, రాజేందర్, జేఎన్‌టీయూ పరీక్షల నిర్వహణ విభాగాధికారులు ప్రొఫెసర్ శివకుమార్, శేఖర్‌రాజు, అంకారావు, శ్రీధర్, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర పాల్గొన్నారు.

సీడీపీఓల బదిలీ

అనంతపురం విద్య, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సాధారణ బదిలీల్లో భాగంగా పలువురు సీడీపీవోలు, అడిషనల్ సీడీపీఓలు బదిలీ అయ్యారు. ఈమేరకు ఐసీడీఎస్ డైరెక్టర్ వేణుగోపాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుడిబండ సీపీడీఓగా పనిచేస్తున్న పద్మావతిని రాయదుర్గం సీడీపీఓగా బదిలీ చేశారు. సోమందేపల్లి సీడీపీఓ అనురాధమ్మను అనంతపురం అర్బన్ సీడీపీఓగా వేశారు. గుత్తిలో అడిషనల్ సీడీపీఓగా పనిచేస్తున్న నాగమణిని కణేకల్లు సీడీపీవోగా బదిలీ చేశారు. శింగనమల సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ అనంతపురం రూరల్ ప్రాజక్టు సీడీపీఓగా బదిలీ చేశారు. అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లి సీడీపీఓ పద్మావతిని కంబదూరు సీడీపీవోగా బదిలీల చేశారు. అనంతపురం సీడీపీవో లలితమ్మను శింగనమల సీడీపీవోగా నియమించారు. అనంతపురం రూరల్ సీడీపీవోగా పనిచేస్తున్న ధనలక్ష్మమ్మను శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ సీడీపీవోగా బదిలీ చేశారు.

ఒకచోట పాజిటివ్... మరో చోట నెగిటివ్

● గర్భిణికి కరోనా విషయంలో విరుద్ధమైన రిపోర్టులు

అనంతపురం టౌన్, జూన్ 6(ఆంధరజ్యోతి): జిల్లాలో మరో గర్భిణికి కరోనా సోకినట్లు ఓ ఆస్పత్రిలో, సోకలేదని మరో ఆస్పత్రిలో తేలింది. వైద్యవర్గాల సమాచారం మేరకు ధర్మవరం పట్టణానికి చెందిన 25ఏళ్ల గర్భిణి అక్కడి ఆస్పత్రికి వెళ్లింది. డాక్టర్లకు అనుమానం రావడంతో కరోనా పరీక్షలు చేయగా పాజిటివ్ వచ్చింది. దీంతో ఆమెను అనంత జిల్లా సర్వజన ఆస్పత్రికి పంపించారు. ఇక్కడ మళ్లీ ఆగర్భిణీకి శాంపిల్స్ తీసి కరోనా పరీక్షలు చేయగా నెగిటివ్ వచ్చినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు తెలిపారు. దీంతో కొత్తగా కరోనా కేసులు నమోదుకాలేదని చెప్పుకొచ్చారు.

వైభవంగా శ్రీకొల్హాపురి మహాలక్ష్మి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

బొమ్మనహాళ్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని తార్కాపురం గ్రా మంలో కొల్హాపురి మహాలక్ష్మీ అమ్మవారి రథోత్సవాన్ని శుక్రవారం సా యంత్రం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఈ రథోత్సవాన్ని ప్రారంభించారు. మేళతాళాలు, నందికోళ్ల, గొరవయ్యల నాట్యాలు, చెక్కభజనలతో గ్రామంలో సందడి నెలకొంది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరేంద్రచౌదరి, భాస్కర్, సోమనాథ్‌గౌడ్, మల్లికార్జున, మజ్జిగ నాగరాజు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారానికి రండి

● మంత్రి అచ్చెన్నాయుడుకు ముంటిమడుగు కేశవరెడ్డి ఆహ్వానం



కేశవరెడ్డిని సన్మానిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

అనంతపురం అర్బన్/గార్లదిన్నె, జూన్ 6(ఆంధ్రజ్యోతి): తన ప్రమాణ స్వీకారానికి రావాలని వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడును ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేవవరెడ్డి ఆహ్వానించారు. విజయవాడలో శుక్రవారం ఆయన అచ్చెన్నాయుడును కలిసి వెంకటేశ్వరస్వామి ప్రతిమను అందజేసి, శాలువా కప్పి సన్మానించారు. అలాగే ముంటిమడుగు కేశవరెడ్డికి మంత్రి శాలువ కప్పి సన్మానించారు. ముంటిమడుగుతోపాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి మంత్రిని కలిశారు.

కార్పొరేటర్ కుమారుడిపై దాడి.. పోలీసులకు ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న మేయర్, మధు తదితరులు

అనంతపురం క్రైం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని 39వడివిజన్ కార్పొరేటర్ చింతకుంట సుశీలమ్మ కుమారుడు చింతకుంట మధుపై కొందరు దాడి చేశారు. ఈ ఘటనపై వైసీపీ నాయకులు నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డివిజన్ పరిధిలో నగర మేయర్ మహమ్మద్ వసీం ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఇందులో మేయర్ వెళ్లిన అనంతరం కొందరు వ్యక్తులు వచ్చి టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో వైసీపీ కార్పొరేటర్లు ఎలా పాల్గొంటారని, మేయర్‌ను ఎలా పిలిపిస్తారని ప్రశ్నిస్తూ చింతకుంట మధుపై దాడి చేశారు. టీడీపీ నాయకులు మోహన్‌కుమార్, అఖిల్, ఏఆర్ కానిస్టేబుల్ నరేంద్ర, మణికుమార్‌లతో పాటు మరో ఆరుగురు వచ్చి దాడి చేశారని చింతకుంట మధు ఆరోపించారు. నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మధు తనపై దాడి చేసిన ఆ నలుగురితో పాటు మరు ఆరుగురిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫిర్యాదు తీసుకునే ధైర్యం లేదా...?

దాడి ఘటనపై మేయర్ మహమ్మద్ వసీం ఆధ్వర్యంలో చింతకుంట మధు, వైసీపీ కార్పొరేటర్లు, నాయకులు ఫిర్యాదు చేయడానికి ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. సీఐ లేకపోవడంతో ఎస్ఐను కలిసేందుకు వెళ్లారు. అనంతరం ఏఎస్ఐకు ఫిర్యాదు చేశారు. తర్వాత మేయర్ మాట్లాడుతూ... ఫిర్యాదు తీసుకునేందుకు భయపడే ఎస్ఐ ఇక ఉద్యోగం ఎందుకు చేయాలని ప్రశ్నించారు. కూటమి పాలనలో నగరంలో అరాచకాలు మొదలయ్యాయన్నారు. వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్ర తదితరులు పాల్గొన్నారు.

'ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించం'

రామగిరి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పరిటాల సునీతపై మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించమని టీడీపీ నాయకులు హెచ్చరించారు. మండలంలోని పేరూరు గ్రామంలో శుక్రవారం పార్టీ మండల కన్వీనర్ సుధాకర్, మాజీవైస్ సర్పంచ్ వెంకటరామిరెడ్డి, నాయకులు చింతరంజన్, శ్రీనివాసులు, మాద న్న విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ఓ గ్రామంలో గత గురువారం దళిత బాలికపై జరిగిన అఘాయిత్యాన్ని పరిటాల సునీత గుండాలు చేశారని, ఇలాంటి సంఘటనలు జరుగుతుంటే ఎమ్మెల్యే ఏం చేస్తున్నారని ప్రకాష్ రెడ్డి మాట్లాడటం సరి కాదన్నారు. ఈ సంఘటన తెలిసిన వెంటనే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ అఘాయిత్యానికి పాల్పడిన వారు ఎవరైన సరే కఠిన చర్యలుతీసుకోవాలని పోలీసులకు సూచించారన్నారు. ఇలాంటి అఘాయిత్యాలను పరిటాల కుటుం బం ఎన్నటికీ క్షమించదన్నారు. మీ ప్రభుత్వ హయాంలో ఇలాంటివి ఎన్నో సంఘటనలు జరిగినా మీరు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. పరిటాల కుటుంబంపై అవాకులు చవాకులు పేలితే సహించేది లేదని వారు హెచ్చరించారు.

పాండురంగస్వామి నిజపాద దర్శనం



ప్రత్యేక అలంకరణలో రుక్మిణి సమేత పాండురంగ స్వామి

అనంతపురం కల్చరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జ్యేష్ఠ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని రామ్‌నగర్‌లోని రుక్మిణి పాండురంగస్వామి ఆలయంలో శుక్రవారం నిజపాద దర్శన కార్యక్రమంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివార్ల మూలవిరాట్‌లకు ఫలపంచామృతాభిషేకాలు చేయడంతోపాటు విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు విరివిగా హాజరై స్వామిని దర్శించుకుని మొక్కులు మొక్కుకున్నారు. కార్యక్రమంలో భవసార క్షత్రియ సమాజ్ అధ్యక్ష కార్యదర్శులు తిరుపతిరావు, ఆనంద్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన



నగర సంకీర్తన నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

అనంతపురం కల్చరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): గాయత్రీమాత జయంతిని పురస్కరించుకుని పాతూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అమ్మవారి నగర సంకీర్తనను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఈ సందర్భంగా పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో గాయత్రీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి చిత్రపటంతో పాతూరు వీధులతో పాటు సున్నపువీధి, తిలక్‌రోడ్డు వీధుల్లో తిరుగుతూ గాయత్రీదేవి నామస్మరణ చేస్తూ ముందుకు సాగారు. అనంతరం ఆలయ ఆవరణలో గాయత్రీ హోమం, అఖండ గాయత్రి మంత్ర పఠనం నిర్వహించారు.

మల్బరీ విస్తరణకు చర్యలు

● సెరికల్చర్ ఆఫీసర్ ఓబులేసు



మల్బరీ తోటలో అధికారులు, రైతులు

అనంతపురం సెంట్రల్, జూన్6(ఆంధ్రజ్యోతి): మల్బరీ సాగు విస్తీర్ణం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సెరికల్చర్ ఆఫీసర్ ఓబులేసు పేర్కొన్నారు. మల్బరీ సాగుపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా పొలాల్లో రైతులను కలిసి మల్బరీ పంటపై రైతులకు వివరిస్తున్నామన్నారు. ఏడాది పొడవునా ప్రతి 30రోజులకు ఒకసారి ఆదాయం సమకూర్చే ఏకైక పంట మల్బరీ అని పేర్కొన్నారు. సాగుకు అవసరమైన మొక్కలు, రేషం షెడ్లు, చంద్రికలు తదితరాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు అందజేస్తున్నాయన్నారు. అదేవిధంగా పట్టుగూళ్లకు మార్కెట్ ధరతో సంబంధంలేకుండా ప్రతి కిలోకు రూ.50 చొప్పున రాయితీ ఇస్తున్నామన్నారు. రైతులను అవగాహన కల్పించి మల్బరీ విస్తీర్ణం పెంచేందుకు సిబ్బందితో కలిసి పొలంబాట పట్టామని తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ ఆఫీసర్ రామలింగారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ అంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడ చూసినా.. ఖాళీ మద్యం బాటిళ్లు

● అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాలు
● రాత్రయితే చాలు మందుబాబుల హల్‌చల్
● భయాందోళనకు గురవుతున్న ప్రయాణికులు



ఆర్ఎం కార్యాలయం పక్కన మద్యం బాటిళ్లు, వాటర్‌ప్యాకెట్లు, గ్లాసులు

అనంతపురంకల్చరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. పగలంతా ప్రయాణికుల రాకపోకలతో సందడిగా ఉండే ఆ ప్రాంతం రాత్రయితే మందుబాబులకు నెలవుగా మారుతోంది. రాత్రివేళల్లో మందుబాబులు బస్టాండు వెనుకభాగాన ఆర్ఎం కార్యాలయ పరిసరాల్లోకి ప్రవేశించి యథేచ్ఛగా మందు తాగుతూ ఖాళీ బాటిళ్లు, వాటర్ ప్యాకెట్లు, ప్లాస్టిక్ గ్లాసులు ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. కొందరు రౌడీమూకలు ఈ ప్రాంతంలో మద్యంమత్తులో గొడవలకు సైతం దిగుతున్నారు. గతంలో ఆర్ఎం కార్యాలయం ముందుభాగాన ఖాళీ ప్రదేశంలో ఓ వ్యక్తి హత్య జరిగింది. మరోవైపు రాత్రి సమయాల్లో ఈ ప్రాంతంలో చీకటి కార్యకలాపాలు కూడా సాగిస్తున్నారు. దీంతో రాత్రివేళల్లో బస్టాండుకు వచ్చే ప్రయాణికులు భయాందోళన చెందాల్సి వస్తోంది. పగటివేళల్లో బస్టాండుతో పాటు ఆర్ఎం కార్యాలయ పరిసరాల్లో ఆర్టీసీ భద్రతా సిబ్బంది సంచరిస్తుండడం వల్ల బాగానే ఉంటోంది. అయితే రాత్రి వేళల్లో సిబ్బంది ఆర్ఎం కార్యాలయ పరిసరాల్లో నిఘా ఉంచకపోవడం వల్ల ఇలాంటి పరిస్థితి ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు బస్టాండు ఆవరణలో అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా ప్రయాణికులకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది.

మందుబాబులు గొడవకు వచ్చారు..



ఇటీవల మా ఊరి నుంచి బస్సులో అనంతపురం రావడానికి రాత్రి 11 గంటల సమయం అయింది. బస్టాండ్‌లో దిగి అక్కడే పార్కింగ్‌లో బైక్‌ను తీసుకుని మెయిన్‌రోడ్డువైపు వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు చేతిలో బీరుబాటిళ్లతో అడ్డుగా వచ్చారు. పక్కకు వెళ్లాలని హారన్ కొట్టినందుకు నాతో గొడవ పడ్డారు. వారితో గొడవ పడలేక నేనే పక్కకు తిరిగి వెళ్లాల్సి వచ్చింది.

- వెంకటరమణ, ప్రయాణికుడు

త్యాగనిరతికి ప్రతీక బక్రీద్: ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : త్యాగనిరతికి ప్రతీక బక్రీద్ అని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోని ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. పండుగను పురస్కరించుకొని నగరంలోని ఈద్గా, మసీదుల్లో తగిన ఏర్పాట్లు చేయాలని నగర పాలక సంస్థ అధికారులను ఆదేశించారు. ముస్లింలు ప్రార్థనలు చేసుకునేందుకు అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పించాలన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి: సీఐ

శింగనమల: బక్రీద్ పండగను ముస్లింలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ కౌలుట్లయ్య సూచించారు. సర్కిల్ పరిధిలోని ముస్లిం మత పెద్దలతో ఆయన మండలకేంద్రంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. బక్రీద్‌ను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తినా పోలీసులకు తెలిపాలని చెప్పారు.

గార్లదిన్నె: మండలముస్లింలు బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ మహమ్మద్‌గౌస్ బాషా సూచించారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ముస్లింలతో ఆయన సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.

ఇసుక తరలింపును అడ్డుకున్న గ్రామస్థులు

శింగనమల జూన్ 6(ఆంధ్రజ్యోతి): నిదనవాడ వద్ద గల పెన్నా నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు, టిప్పర్లను ఆ గ్రామస్థులు శుక్రవారం అడ్డుకున్నారు..గత రెండు రోజుల నుంచి కొందరు వ్యక్తులు ఇసుకను తరలిస్తుండడంతో గ్రామస్థులు వెళ్లి ట్రాక్ట ర్లు, టిప్పర్లను అడ్డుకుని వాటిని వెనక్కు పంపారు. పెన్నానదిలో ఇసుక తరలిస్తుండడంతో బోర్లలో భూగర్భజలాలు అడుగంటుతాయని వారు పేర్కొన్నారు.

యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం: డీఎంహెచ్ఓ



యోగాసనాలు వేస్తున్న డీఎంహెచ్ఓ, నగర కమిషనర్

అనంతపురం క్రైం/అనంతపురం క్లాక్‌టవర్: జూన్ 6(ఆంధ్రజ్యోతి): యోగాసనాలు వేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని డీఎంహెచ్ఓ ఈబీ సూచించారు. నగరపాలిక ఆధ్వర్యంలో శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఇందు లో డీఎంహెచ్ఓతో పాటు నగర కమిషనర్ బాలస్వామి, అధికారులు, సిబ్బంది యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ... యోగాసనాలు వేయడం వలన మానసకంగా శారీరకంగా ఆరోగ్యంగా ఉంటారన్నారు. యోగాంధ్రపై గ్రామస్థాయి వరకు అవగాహన తీసుకురావాలన్నారు. ప్రతి ఒక్కరూ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకుని ఈ నెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ... ప్రతిరోజు అరగంట వీలు క ల్పించుకుని యోగాసనాలు, ధ్యానం చేస్తే ఒత్తిడి తగ్గుతుందన్నారు. డిప్యూటీ కమిషనర్ పావని, ఆయుష్ డిపార్ట్‌మెంట్ డాక్టర్ భాస్కర్, డీపీఆర్వో గురుస్వామి శెట్టి, వివేకానంద యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి యోగా సెంటర్ గురువు ఆంజనేయులు, ఆరోగ్య బోధన అధికారి గంగాధర్, మున్సిపల్ ఉద్యోగులు , సిబ్బంది పాల్గొన్నారు.

యోగా సర్వరోగ నివారిణి

అనంతపురం టౌన్: ప్రతిరోజు యోగాసనాలు వేయడం వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం చేకూరుతుందని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు సూచించారు. నగరంలోని శారదానగర్‌లో ఉన్న సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో శుక్రవారం ఆయన యోగాంధ్ర కాంపెయిన్‌లో భాగంగా యోగాపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నిత్యం యోగా చేస్తే ఒత్తిడి దూరమవుతుందన్నారు. ఈ నెల 21న నిర్వహించే యోగాడేను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సూపర్‌స్పెషాలిటీ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టరు బెనెడిక్ట, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అత్యాచారం చేసిన వారిని ఎన్‌కౌంటర్ చేయాలి

● ప్రజాసంఘాల నాయకుల డిమాండ్
● ఈ ఘటనకు రాజకీయాలతో ముడిపెట్టొద్దని విజ్ఞప్తి

అనంతపురం సెంట్రల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడిన వారిని బహిరంగంగా ఎన్‌కౌంటర్ చేయాలని వివిధ ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలో శుక్రవారం వారు వేరువేరుగా విలేకరులతో మాట్లాడుతూ.. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలంలోని ఓ గ్రామానికి చెందిన 14ఏళ్ల దళిత బాలికపై జరిగిన అత్యాచార ఘటనను రాష్ట్ర ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారించాలని కోరారు. గ్రామాల్లోని ప్రజలు ఏదో ఒక రాజకీయపార్టీకి సానుభూతి పరులుగా ఉంటారని, ఏ రాజకీయపార్టీలతోనూ బాలిక అత్యాచారాన్ని ముడపెట్టి అసత్యప్రచారాలతో కేసును పక్కదోపట్టించొద్దని కోరారు. ఏ ప్రభుత్వముంటే ఆ రాజకీయ పార్టీకి అంటగట్టి సానుభూతి పొందాలన్న ఆలోచనలు సరికాదన్నారు. మానవ మృగాలు బాలికను భయభ్రాంతులకు గురి చేసి కేసుపెట్టకుండా దాచిపెట్టడం ఘోరమని, నిందితుల పక్షాన కేసును వాదించడానికి న్యా యవాదులెవరూ ముందుకు రాకూడదని ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ విజ్ఞప్తిచేశారు. బాలికలు, మహిళలపై అత్యారాలు చేయాలన్న ఆలోచన రాకుండా భయపడేలా శిక్షలుండాలని ఆర్ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర పేర్కొన్నారు. అత్యాచారానికి పాల్పడిన వారందరినీ కులాలు, పార్టీలతో సబంధంలేకుండా బహిరంగంగా ఎన్‌కౌంటర్ చేయాలని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధికారప్రతినిధి డాక్టర్ అక్కులప్ప డిమాండ్ చేశారు. అత్యాచారంలో ముద్దాయిలు ఎవరో త్వరతగతిన తేల్చాలంటే కేసును పాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారించాలని బహుజన లాయర్స్ ఫోరం(బీఎల్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు నారాయణప్ప ప్రభుత్వాన్ని కోరారు.

ఆస్పత్రిలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు



సదస్సులో మాట్లాడుతున్న కమిటీ ప్రిసైడింగ్ ఆఫీసర్ డాక్టర్ హేమలత

అనంతపురం టౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పని ప్రదేశంలో మహిళా ఉద్యోగులను లైంగికంగా వేధించేవారిపై చర్యలు తీసుకోవడం కోసం జిల్లా ఆస్పత్రిలో అంతర్గత మహిళా కమిటీ ఏర్పాటు చేసినట్లు ఆ కమిటీ ప్రిసైడింగ్ ఆఫీసర్ ఆర్ఎంఓ డాక్టరు హేమలత తెలిపారు. మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపుల నివారణ కమిటీ శుక్రవారం ఎంపికైంది. కమిటీ ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టరు హేమలత, సభ్యులుగా డాక్టరు షబానా, నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి, అడ్వకేట్ శశికళ నియమితులయ్యారు. కమిటీ ఎంపిక తర్వాత ఆస్పత్రిలో మహిళా డాక్టర్లు, నర్సులు, ఇతర ఉద్యోగిణులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కమిటీ ప్రిసైడింగ్ ఆఫీసర్ హేమలత మాట్లాడుతూ పని ప్రదేశంలో వేధింపులకు గురవుతున్నా, చాలామంది బయటకు చెప్పుకోలేక మౌనంగా ఉంటూ లోలోపల కుంగిపోతుంటారన్నారు. ఈలైంగిక వేధింపులను అరికట్టడానికి ప్రత్యేకంగా అంతర్గత కమిటీల ఏర్పాటుకు కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడితే వెంటనే కమిటీ దృష్టికి తేవాలన్నారు. ఈకమిటీ గుట్టుగా అంతర్గతంగా విచారణ జరిపి వాస్తవమైతే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా చేస్తామన్నారు. ఈపోష్ చట్టం, కమిటీ పనితీరుపై ప్రతిమహిళా ఉద్యోగి అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు.

బస్టాండు పరిసరాల్లో పొగాకు నిషేధాన్ని అమలు చేయాలి



బస్టాండు ఆవరణలో అవగాహన ప్రదర్శన

అనంతపురం కల్చరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతా ల్లో పొగాకు నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని జిల్లా పొగాకు నియంత్రణ పర్యవేక్షణాధికారి డాక్టర్ నారాయణ స్వామి అన్నారు. నగరంలోని బస్టాండు ఆవరణలో శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పొగాకు నిషేధంపై అవగాహన కల్పిస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ... జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలన్నింటినీ పొగాకు సేవన రహితంగా మార్చాలన్నారు. కార్యాలయాల చుట్టుపక్కల పొగాకుకు సంబంధించిన దుకాణాలు లేకుండా చూడాలన్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రదర్శించామన్నారు. పొగాకు ఉత్పత్తుల చట్టం-2003 ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే రూ.200లు విధించడం జరుగుతుందన్నారు. అలాగే 18 ఏళ్ల లోపు వయసు గల పిల్లల చేత సిగరెట్, పొగాకు ఉత్పత్తులు అందించరాదన్నారు. విద్యాసంస్థలకు 100 గజాలలోపు పొగాకును నిషేధించడం జరిగిందని, దీనిని అతిక్రమించినవారు శిక్షార్హులని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పొగాకు నియంత్రణ సోషల్ వర్కర్ శ్రీరాములు, ఆర్టీసీ బస్టాండు మేనేజర్ కేఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన





గార్లదిన్నె అంగన్వాడీ కేంద్రం వద్ద మొక్కలు నాటుతున్న దృశ్యం, నార్పల మండలం సిద్ధరాచెర్లలో..

గార్లదిన్నె, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని రెండో అంగన్వాడీ సెంటర్‌లో శుక్రవారం ఐసీడీఎస్ఐ సీడీపీఓ ఉమాశంకరమ్మ బాలికలకు కిశోరి వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బాలికలు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అలాగే వారికి ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. బాల్యవివాహాల వల్ల కగిగే నష్టాలను తెలియజేశారు. గుడ్ టచ్- బ్యాడ్ టచ్‌పై అవగాహన అవగాహన కల్పించారు. అదేవిధంగా మహిళల కోసం ఉన్న హక్కులు, పోక్సో చట్టాలపై వివరించారు. అనంతరం అందరూ కలిసి అంగన్వాడీ సెంటర్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ మనస్విని, అంగన్వాడీ వర్కర్లు జూదేబేగం, అన్నమ్మ, ఆయాలు, పలువురు కిశోరి బాలికలు పాల్గొన్నారు.

● శింగనమల: మండలంలోని నాగులగుడ్డం అంగన్వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సీడీపీఓ ఉమాశంకరమ్మ కిశోరి వికాసంపై బాలికలకు అవగాహన కల్పించారు. తొలుత అంగన్‌వాడీ సిబ్బంది, బాలికలతో కలిసి గ్రామ పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. బాల్యవివాహాలు చేయరాదంటూ నినాదాలు చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ బాలికలకు ఆరోగ్యం, పరిశుభ్రత, పౌష్టికాహారం, చదువు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. తర్వాత అక్కడి ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ధనలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

●నార్పల: మండలంలోని బొందలవాడ సెక్టారు సిద్ధరాచర్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసంపై బాలికలకు ఐసీడీఎస్ సీడీపీఓ భారతి అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌వీ అమృత, మహిళా పోలీస్ భాగ్యలక్ష్మి, సూపర్‌వైజర్ మధుమాలిని, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



ఉత్సవమూర్తులకు చందనోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

అనంతపురం కల్చరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : తపోవనంలోని శ్రీక్షేత్రంలో శ్రీవైష్ణవ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 4 నుంచి నిర్వహిస్తున్న శ్రీవారి దశమ బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో ఉత్సవాల ముగింపు సూచికగా ధ్వజఅవరోహణం, చందనోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం, నిరాటోత్సవం, రాత్రికి శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీవెంకటేశ్వరస్వామికి ఊంజలసేవ నిర్వహించి ఉత్సవాలను ముగించారు. కార్యక్రమంలో శ్రీవైష్ణవ సంఘం జిల్లా అధ్యక్షుడు జ్వాలాపురం శ్రీకాంత్, ఆలయ కమిటీ సభ్యులు జ్వాలాపురం హరి, ఈఎస్వీ రవి, అర్చకుడు రాఘవేంద్ర పాల్గొన్నారు.

భారత ఆర్మీకి విరాళం

అనంతపురం సెంట్రల్, జూన్6 (ఆంధ్రజ్యోతి): భారత ఆర్మీ త్రివిధ దళాల నిధికి అనంతపురం హరిశ్చంద్ర ఘాట్ అధ్యక్షుడు జగదీష్, ట్రెజరర్ సాయినాథ్ గుప్తి రూ.1,01,116 విరాళం అందజేశారు. నగరంలో శుక్రవారం వారు జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్పను కలిసి విరాళ మొత్తాన్ని చెక్కురూపంలో అందజేశారు. ఈ సందర్భంగా వారిని అభినందించిన తిమ్మప్ప మాట్లాడుతూ విరాళాలు అందజేసేవారు కార్యాలయ ఫోన్ నెంబర్ 08554 241146కు సంప్రదించాలని కోరారు. అదేవిధంగా ఎస్‌బీఐ అకౌంట్ 62076956433కు ఆన్‌లైన్‌ద్వారా అందించవచ్చునని తెలిపారు.

24 పాయింట్లు వేసుకున్న టీచర్‌పై చర్యలు తీసుకోండి

●డీఈఓకు ఏపీటీఎఫ్ ఫిర్యాదు

అనంతపురం విద్య, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల బదిలీల్లో నిబంధనలకు విరుద్ధంగా 8 ఏళ్ల స్టేషన్ పాయింట్లు 24 వేసుకున్న టీచర్ రాఘవేంద్రపై చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గౌనిపాతిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్‌కుమార్, ఇతర నేతలు డీఈఓను కోరారు. శుక్రవారం వారు డీఈఓ ప్రసాద్‌బాబును కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ బదిలీల సీనియారిటీ లిస్టులో 38వ స్థానంలో ఉన్న రాఘవేంద్ర ఇటీవల వరకూ కళ్యాణదుర్గం మండలం తిమ్మసముద్రం ఎంపీయూపీఈ స్కూల్‌లో 2023 నుంచి 2025 వరకూ పనిచేశారన్నారు. అయితే రీ అపోర్షన్‌లో అతని పోస్టు పోయిందన్నారు. అంతకు ముందున్న స్టేషన్‌లో 2017 నుంచి 2023 వరకూ పనిచేశారన్నారు. సదరు టీచర్ పాత స్టేషన్ పాయింట్లు వాడుకున్నా... 17.5055 పాయింట్లు రావాల్సి ఉందని, అయితే అతను 8 ఏళ్లు పనిచేసినట్లు 24 పాయింట్లు వేసుకున్నారన్నారు. దీనిపై ఎంఈఓకు ఫిర్యాదు చేస్తే... డీఈఓ ఆఫీస్‌లో అతని పాయింట్లు తొలగించి 17.5055 పాయింట్లు వేయించిందన్నారు. తర్వాత పలుకుబడి ఉపయోగించుకుని మళ్లీ 24 పాయింట్లు వేయించుకోవడంతో మంచి ప్లేస్ జడ్పీహైస్కూల్ కాలువపల్లి వచ్చిందన్నారు. అధిక పాయింట్లు వేసుకున్న అతనిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలోజిల్లా అధ్యక్షులు వెంకటేశులు, ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, ఇతర నాయకులు మోహన్‌రెడ్డి, నరేష్ కుమార్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠ తర్వాత పూజలందుకుంటున్న గణనాథుడు

అనంతపురం కల్చరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని లలితకళా పరిషత్ ఆవరణలో నూతనంగా నిర్మించిన వినాయక మందిరంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో గోపూజ, అనంతరం గణనాథుడి మూలవిరాట్‌ను ప్రతిష్ఠ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షుడు గురుప్రసాద్, ప్రధాన కార్యదర్శి గాజుల పద్మజ, ఉపాధ్యక్షుడు సంగాల నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు

● వైసీపీ నాయకుల తప్పిదమే కారణం

శింగనమల, జూన్ 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకులు చేసిన తప్పిదానికి ప్రభుత్వ నూతన భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. అప్పట్లో మండలంలోని రాచేపల్లి పంచాయతీలో సచివాలయ భవనం నిర్మించాల్సి ఉండగా.. వైసీపీ నాయకులు పట్టుపట్టి సమీపంలోని నిదనవాడ పంచాయతీలో నిర్మింపజేశారు. అక్కడ నూతన సచివాలయం భవనంతో పాటు రైతు సేవా కేంద్రం, హెల్త్ క్లినిక్‌కు కూడా భవనాలు నిర్మింపజేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ రాచేపల్లి పంచాయతీ వాసులు నిరసనలు వ్యక్తం చేశారు. అప్పటి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి భర్త ఆలూరు సాంబశివారెడ్డి, వైసీపీ మండల ఇన్‌చార్జి బొమ్మన శ్రీరామిరెడ్డి తమ పంతమే నెగ్గాలని నిదనవాడలోనే దాదాపు రూ.1.20కోట్లు వెచ్చించి సచివాలయం, రైతు సేవా కేంద్రం, హెల్త్ కిన్లిక్‌ల భవనాలు నిర్మించి ప్రారంభించారు. అనంతరం రాచేపల్లి పంచాయతీ భవనం నుంచి నిదనవాడలోని నూతన భవనాలకు మార్పు చేయడానికి ప్రయత్నాలు చేయడంతో రాచేపల్లి ప్రజలు తమ గ్రామంలో సచివాలయం తరలించవద్దని మూకుమ్మడిగా పెద్ద ఎత్తున నిరసనలు తెలిపారు. వైసీపీ నాయకులు,పోలీసులు,అధికారులు చేసేది ఏమీ లేక సచివాలయాన్ని అక్కడే కొనసాగిచారు. రాచేపల్లి గ్రామస్థులు తమ గ్రామంలోనే సచివాలయం నూతన భవనాలు నిర్మించాలని తెలిపినా వైసీపీ నాయకులు మొండిపట్టుకు వెళ్లి నిదనవాడలో కోట్లు వెచ్చించి భవనాలు నిర్మింపజేశారు. అవి ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. వైసీపీ నాయకులు చేసిన చిన్న పాటి తప్పిదంతోనే అవి ఇలా నిరుపయోగంగా ఉన్నాయని మండల వాసులు మండిపడుతున్నారు.



నిదనవాడలో నిరుపయోగంగా ఉన్న సచివాలయం, రైతు సేవా కేంద్రం భవనాలు

అందని పండ్లతోటల బిల్లులు

రైతుల నిరీక్షణ

శెట్టూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండల వ్యాప్తంగా వందలాది ఎకరాల మెట్ట భూముల్లో రైతులు పండ్లతోటల పెంపకం చేపట్టారు. అయితే వాటి బిల్లుల కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. ఆ బిల్లుల కోసం తాము ఉపాధి అధికారుల చుట్టూ తిరుగుతున్నా.. వారు పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. లక్షలాది రూపాయలు అప్పులు చేసి ఈ పండ్లతోటలు సాగు చేశామని, జిల్లా అధికారులు స్పందించి వెంటనే బిల్లులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారులు స్పందించాలి



ఉపాధి హామీ పథకం ద్వారా చీనీ మొక్కల పెంపకం చేపట్టాం. ఉపాధి సిబ్బంది సకాలంలో బిల్లులు మంజూరు చేయడం లేదు. వెంటనే బిల్లులు చేసి మమ్మల్ని ఆదుకోవాలి.

-మంజునాథ, రైతు, శెట్టూరు



బసంపల్లి వద్ద సాగుచేసిన పండ్ల మొక్కలు

న్యూస్ బాక్స్

టీడీపీ కార్యకర్తకు మంత్రి నివాళి



నివాళులర్పిస్తున్న మంత్రి పయ్యావుల

వజ్రకరూరు(ఉరవకొండ), జూన్6(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం గడేహోతూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మోకా గురుస్వామి అనారోగ్యంతో శుక్రవారం మరణించాడు. ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్ ఆ గ్రామానికి వెళ్లి ఆయన మృతదేహానికి నివాళులర్పించారు.మంత్రి వెంట మండల కన్వీనర్ నూతేటి వెంకటేశులు, నాయకులు నాగేంద్ర, ఎర్రిస్వామి, అనంతయ్య, వన్నూరుస్వామి, వలి ఉన్నారు.

10 నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంప్

పెద్దవడుగూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): స్థానిక అంగన్‌వాడీ సెంటర్-1లో, కిష్టిపాడు గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్-1లో ఈనెల 10 నుంచి 13 వరకు ఆధార్ అప్‌డేట్ ప్రత్యేక క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బారెన్‌సాబ్ తెలిపారు. అలాగే 24 నుంచి 27 వరకు రెండో విడత క్యాంప్ నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

15న విభిన్న ప్రతిభావంతుల శిబిరం

ఉరవకొండ జూన్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ వయో శ్రీ యోజన పథకం కింద విభిన్న ప్రతిభావంతులు, వృద్ధులకు ఈ నెల 15న స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రవి ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినికిడి యంత్రాలు, చేయి, కాలు లేని వారికి కృత్రిమ అవయవాలు, మూడు చక్రాల సైకిల్లు, వీల్ చైర్లు, బ్యాటరితో నడిచే ట్రైసైకిల్లు, వృద్ధులకు చేతి కర్రలు తదితర ఉపకరణాలు ఎన్ని అవసరం అవుతాయో అంచనా వేయడానికి ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

తాడిపత్రి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): అదానీ సిమెంట్ పరిశ్రమ వారు నిత్యం వందలాది భారీ వాహనాలు సంచరిస్తుండటంతో రోడ్డు బాగా దెబ్బతిందని సజ్జలదిన్నె గ్రామస్థులు వాపోయారు. వాటిని మరమ్మతులు చేయించాలని, లేకుంటే ఈ ఈనెల 10న ఆ లారీలను అడ్డుకుంటామని హెచ్చరించారు.

బాధితులకు పరామర్శ

పామిడి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామరాజుపల్లి, రామగిరి, గజరాంపల్లి, కండ్లపల్లి గ్రామాల్లో గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు, పామిడి మండల టీడీపీ ఇన్‌చార్జి గుమ్మనూర్ ఈశ్వర్ శుక్రవారం పర్యటించారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న వారిని పరామర్శించారు. గజరాంపల్లిలో సుంకుల పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వేడకలో పాల్గొన్నారు. ఆయన వెంట తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ చౌదరి, మున్సిపాల్ మాజీ చైర్మన్ గౌస్‌పీరా, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జింకల సంజీవకుమార్ ఉన్నారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గం ఏకగ్రీవం

కణేకల్లు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండల లయన్స్‌క్లబ్ కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యూ చాంద్ బాషా, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్‌గుప్తా, నరేంద్ర, కార్యదర్శిగా ఆదినారాయణ, సంయుక్త కార్యదర్శిగా అశోక్‌కుమార్, ట్రెజరర్లగా గోపాల్, షేక్‌హుస్సేన్, క్లబ్ మెంబర్ షిప్ చైర్మన్‌గా ఆనంద్‌రాజ్, మార్కెటింగ్ కార్యదర్శిగా రమేష్ ఎన్నికయ్యారు.

అత్యాచారం నిందితులను కఠినంగా శిక్షించాలి

గుంతకల్లుటౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పేరూరు పంచాయతీలో దళిత బాలికపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఐద్వా పట్టణ అధ్యక్షురాలు బీ జ్యోతి ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్‌లో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఐద్వా పట్టణ కార్యదర్శి కార్యదర్శి రంగమ్మ, సభ్యులు జయమ్మ, షాకీరా, సరస్వతి, ఆదిలక్ష్మి, చిన్నలక్ష్మి, ప్రభావతి, సాయి,రామలక్ష్మి, హుసేన్ బీ, నాగమ్మ పాల్గొన్నారు.

మేలైన నూనె గింజలను ఎంపిక చేసుకోండి

కూడేరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): నూనె గింజల సాగు చేసే సమయంలో మేలైన నూనె గింజలను ఎంపిక చేసుకోవాలని భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ మాతుర్ సూచించారు. మండలం పి. నారాయణపురం గ్రామంలో శుక్రవారం రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సు లో ఆయనతో పాటు శాస్త్రవేత్తలు విజయ్‌శంకర్, మంజునాథ్, సతీష్, వెంకటేష్ మాట్లాడారు. అనంతరం పలువురు రైతులకు ఆముదం విత్తనాల ఉచితంగా అందించారు. ఇందులో ఏఓ విజయ్‌కుమార్, సర్పంచు హనుమంతురెడ్డి పాల్గొన్నారు.

వాహనాల వేలం

విడపనకల్లు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఎస్ఐ ఖాజాహుస్సేన్ ఆధ్వర్యంలో శుక్రవారం వేలం వేశారు. నాలుగు ద్విచక్రవాహనాలు వేలం వేయగా రూ.11,918 వచ్చిందని, ఈ మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాలో జమ చేస్తామని ఎస్ఐ తెలిపారు.

అక్రమాలను అరికట్టండి

తాడిపత్రి, జూన్6(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం పంపిణీలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ నాయకులతో కలిసి తహసీల్దార్ రజాక్‌వలికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. 35 కేజీలు తీసుకొనే వారికి 4 కేజీలు తగ్గించి 31 కేజీలు మాత్రమే ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు రామాంజి, నాగేంద్ర, రమణ, రత్నమయ్య, అబ్రహం, నాగార్జున పాల్గొన్నారు.

వారపు సంత వేలం

బొమ్మనహాళ్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీధరఘట్టలో ప్రతి శనివారం జరిగే వారపు సంతకు డిప్యూటీ ఎంపీడీఓ దాస్ శుక్రవారం వేలంపాట నిర్వహించారు. ఇందులో రూ.ఐదువేలు డిపాజిట్ చెల్లించి ఆరుగురు పాల్గొన్నారు. ఉప్పర రమేష్ రూ.37 వేలకు వేలంపాటలో ఆ సంతను దక్కించుకున్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం

గుమ్మఘట్ట, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వాటిని పరిష్కరించడం లేదని సర్వసభ్య సమావేశంలో సభ్యులు వాపోయారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భవానీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు మాట్లాడారు. మండలంలో సర్పంచులు, ఎంపీటీసీల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

దుకాణాల తనిఖీ

రాయదుర్గంరూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వినాయకసర్కిల్‌లోని హోల్‌సేల్, కిరాణాషాపులు, బేకరాలు, తోపుడు బండ్లు, మున్సిపల్ మార్కెట్‌లోని దుకాణాలను మున్సిపల్ కమీషనర్ దివాకర్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. మొత్తం 82 కేజీల నిషేధిక ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకొని.. వారికి జరిమానా విధించారు. మరోసారి వీటిని వాడితే దుకాణాలను సీజ్ చేస్తామన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలపై అవగాహన

రాయదుర్గం రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై మండలంలోని కదరంపల్లి గ్రామంలో ఉప ఆరోగ్య విద్యాధికారి కెంచె లక్ష్మీనారాయణ శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎక్కడైనా బాల్యవివాహాలు నిర్వహిస్తుంటే 1098కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఇందులో ఆరోగ్య పర్యవేక్షకులు రామాంజినేయులు, సుజాత, ఆరోగ్య కార్యకర్త కొల్లమ్మ, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



లైనింగ్ పనులను పరిశీలిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

హెచ్చెల్సీ పనుల పరిశీలన

బొమ్మనహాళ్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బొమ్మనహాళ్ హెచ్చెల్సీ సెక్షన్ పరిధిలో నాగలాపురం, మల్లికేతి వద్ద జరుగుతున్న బ్రిడ్జి, లైనింగ్ పనులను ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, తుంగభద్ర ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కేశవరెడ్డి, డీఈఈ దివాకర్‌రెడ్డితో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఐదేళ్ల ఈ కాలువపై ఎలాంటి మరమ్మతులు చేయకూడదని మారిటోరియం విధించినా, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే యుద్ధ ప్రాతిపదికన రూ.35 కోట్లతో మరమ్మతులు చేయిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట జేఈ అల్తాఫ్, టీడీపీ నాయకులు మల్లికార్జున, మాలపాటి ధనుంజయ, బలరాంరెడ్డి, ఎర్రగుంట్ల వెంకటేశులు, కొత్తపల్లి తిమ్మరాజు, మహేంద్ర, పీ నాగరాజు, నవీన్, సైకిల్‌షాప్ హనుమంతు, శీనా, సంగప్ప, మాజీ డైరెక్టర్ నాగరాజు ఉన్నారు.

● బొమ్మనహాళ్ మండలంలోని శ్రీధరఘట్టలో వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలో ఎమ్మెల్యే కాలవ పాల్గొన్నారు. ఇందులో టీబీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ కేశవరెడ్డి, తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ విజయభాస్కర్, టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, సింగల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

● డీ.హీరేహాళ్: మండలంలోని నాగలాపురం గ్రామంలోని ప్రభుత్వ వైద్యశాలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు శుక్రవారం తనిఖీ చేశారు. అందుతున్న వైద్యసేవలు, సమస్యలపై రోగుల వద్ద ఆరా తీశారు. ఆయన వెంట మండల కన్వీనర్ బలరామిరెడ్డి, తెలుగు యువత నాయకుడు గోవిందు, మాజీ ఎంపీటీసీ వెంకటేశు, సంగప్ప, స్టోర్ డీలర్ శీన, మాజీ సర్పంచ్ తిమ్మయ్య ఉన్నారు.

● కణేకల్లు : శ్రీచిక్కణ్ణేశ్వర చెరువు వద్ద జరుగుతున్న ఔట్‌ఫాల్ రెగ్యులేటర్ పనులను ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పరిశీలించారు. దాదాపు రూ. 4.20 కోట్లతో చేపట్టిన ఈ పనులను నాణ్యంగా చేపట్టాలని కాంట్రాక్టర్లు, హెచ్చెల్సీ అధికారులను ఆదేశించారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి

తాడిపత్రి, జూన్6(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో సాధారణ మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని వైస్‌చైర్మన్ అరుణ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణంలో తాగునీరు, డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్టీపీ వద్ద ఉన్న పాత మోటార్లు సరిగా పనిచేయకపోవడంతో వాటిస్థానంలో ఎక్కువ సామర్థ్యం గల కొత్త మోటార్లను అమర్చాలన్నారు. ఆర్వోప్లాంట్ మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

చంద్ర రాజేశ్వరరావుకు ఘన నివాళి



చంద్ర రాజేశ్వరరావు ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గుంతకల్లుటౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): సీపీఐ నేత చంద్ర రాజేశ్వరరావు 111వ జయంతి సందర్భంగా స్థానిక బీటీ పక్కీరప్ప భవనంలో ఆ పార్టీ నాయకులు ఆయన ఫ్లెక్సీ వద్ద శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో ఆయన చేసిన పోరాటాలు నేటికీ ఆదర్శమని కొనియాడారు. ఇందులో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, మండల కార్యదర్శి రాము, సహాయ కార్యదర్శి రామాంజినేయులు, నాయకులు పాల్గొన్నారు.

జవాన్‌కు ఘన స్వాగతం



గుత్తి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న గుత్తి ఆర్ఎస్‌కు చెందిన జవాన్ నాగేంద్రబాబుకు శుక్రవారం స్థానికులు ఘనస్వాగతం పలికారు. ఆయన్ను సన్మానించారు. ఇందులో జిల్లా జైగౌడ్ సభ్యుడు లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.

చీడపీడల నివారణపై అవగాహన



కరపత్రాలు విడుదల చేస్తున్న అధికారులు

విడపనకల్లు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రైతులు ఖరీఫ్‌లో సాగుచేసే పంటలకు చీడపీడలు సోకకుండా.. అధిక దిగుబడులు సాధించడానికి పాటించాల్సిన సస్యరక్షణ పద్ధతులపై వ్యవసాయ శాస్త్రవేత్తలు శుక్రవారం అవగాహన కల్పించారు. అనంతపురంలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శారద, బాలాజీనాయక్ మండలంలోని పాల్తూరు గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పంటలకు వాడే మందుల వివరాలతో కూడిన కరపత్రాలను విడుదల చేశారు.

ఆర్డీటీకి అండగా ర్యాలీ

వజ్రకరూరు(ఉరవకొండ), జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో సేవ్ ఆర్డీటీ నినాదంతో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఇందులో బంజారా సంఘం నాయకుడు కేశవనాయక్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ అనుమతి ఇవ్వాలని కోరారు. అనంతరం తహసీల్దార్ నరేష్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఇందులో మాజీ జడ్పీటీసీ తులసిదాస్ నాయక్, దళిత సంఘాల నాయకులు బెంజిమన్, ఆనంద్‌రాజు, సర్పంచ్ మోనాలిసా పాల్గొన్నారు.

కేజీబీవీలో పనులకు భూమిపూజ



యల్లనూరులో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

యల్లనూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజీబీవీ పాఠశాలలో రూ.1.10 కోట్లతో చేపట్టే అదనపు గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్వశిక్షా అభియాన్ డీఈ జయరాం, ఎంఈఓ చంద్రశేఖర్, టీడీపీ మండల కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు అనీల్‌కుమార్‌చౌదరి, రవీంద్రరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, యల్లనూరు నారాయణస్వామి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

● పుట్లూరు : స్థానిక కేజీబీవీ బాలికల పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ భూమిపూజ చేశారు. రూ.1.60 కోట్లతో ఈ పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం వృద్ధుల ఇంటివద్దకు వెళ్లి రేషన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషారెడ్డి, ఎంపీడీఓ అలివేలమ్మ, టీడీపీ మండల కన్వీనర్ బాలరంగయ్య, నాయకులు సుదర్శన్‌నాయుడు, శ్రీనివాసులునాయుడు, మోటాటి పవన్‌కుమార్‌రెడ్డి, గోవర్ధన్, నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

గుంతకల్లుటౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రైవేట్ విద్యాసంస్థలు ఫీజుల పేరుతో చేస్తున్న దోపిడీని అరికట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు టీ వెంకటేష్ మాదిగ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థలపై జిల్లా విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

11న చలో విజయవాడ

ఉరవకొండ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 11న చేపట్టబోయే చలో విజయవాడ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను స్థానిక కౌలు రైతు సంఘం నాయకులు శుక్రవారం విడుదల చేశారు. ఇందులో ఆ సంఘం నాయకులు రంగారెడ్డి, బాలరంగయ్య, సురేష్, వెంకటేష్, సుంకన్న పాల్గొన్నారు.

మందకృష్ణకు పద్మశ్రీపై సంబరాలు

కూడేరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు రావడంతో కూడేరులో దళితులు, దళిత సంఘాల నాయకులు శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. ఎంపీడీఓ కార్యాయలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి స్థానిక సర్పంచు లలితమ్మ, నాయకులు పూలమాలలు వేశారు.

వేరుశనగ విత్తనాల పంపిణీ

విడపనకల్లు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): స్థానిక రైతు సేవా కేంద్రంలో సబ్సిడీతో వేరుశనగ విత్తనాల పంపిణీని వ్యవసాయ అధికారి హెచ్ పెన్నయ్య, టీడీపీ నాయకులు శుక్రవారం ప్రారంభించారు. పెన్నయ్య మాట్లాడుతూ.. మండలానికి కే6 రకం వేరుశనగ విత్తనాలు వంద క్వింటాళ్లు వచ్చాయని, క్వింటా మార్కెట్ ధర రూ. 9300 ఉండగా రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ రూ. 3720 పోను రైతు వాటాగా రూ. 5580 చెల్లించి విత్తనాలు తీసుకోవాలన్నారు. అర ఎకరాకు ఒక బస్తా (30 కేజీలు), ఎకరాకు రెండు బస్తాలు, ఎకరం పై ఎంత భూమి ఉన్నా మూడు బస్తాలు ఇస్తారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు ఏఈఓ రాఘవేంద్ర, ఎంపీఈఓ మల్లేశ్వరి, టీటీడీపీ నాయకులు హనుమంతు పాల్గొన్నారు.

● ఉరవకొండ : స్థానిక తహసీల్దారు కార్యాలయం ఆవరణంలో వేరుశనగ విత్తన కాయలను పంపిణీ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామాంజినేయులు, ప్యారం కేశవానంద పాల్గొన్నారు. మండలంలోని రాకెట్ల, కౌకుంట్ల గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఏఓ శుభకర్, టీడీపీ నాయకులు సుంకన్న, వరప్రసాద్, రాజేష్, సుదర్శన్, ప్రసాద్, రఫీ, మాజీ సర్పంచ్ ఎర్రిస్వామి పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేసుకోండి

యాడికి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): సబ్సిడీ విత్తన వేరుశనగ కోసం అర్హులైన రైతులు సంబంధిత రైతుసేవా కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మహబూబ్‌బాషా సూచించారు. అన్ని రైతు సేవా కేంద్రాల్లో సోమవారం నుంచి పేర్ల నమోదు కార్యక్రమాన్ని చేపట్టామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డ్రైనేజీ పైప్‌లైన్‌కు మరమ్మతులు



డ్రైనేజీ పైప్ మరమ్మతుల కోసం తవ్విన గుంత

తాడిపత్రి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్ సర్కిల్‌లో డ్రైనేజీ పైపులైన్ మరమ్మతు పనులు నిర్వహిస్తున్నారు. సంజీవనగర్, కృష్ణాపురంరోడ్డు, పుట్లూరురోడ్డు ప్రాంతాలకు సంబంధించి డ్రైనేజీ సమస్య ఉండటంతో ఈ పనులు చేపట్టారు. ఈ పనులు పూర్తి చేయడానికి మూడు రోజులు పడుతుందని, ప్రజలు సహకరించాలని అధికారులు కోరారు. ఈ పనులను ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పరిశీలించి.. పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

తహసీల్దార్‌గా అనిల్‌కుమార్



బెళుగుప్ప, జూన్ 6(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్‌గా అనిల్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన డీ హీరేహాళ్ మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడి తహసీల్దార్ షర్మిల కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

నీటి సమస్య ఉంటే ఫోన్ చేయండి



మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్

కళ్యాణదుర్గం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంచినీటి సరఫరాలో అంతరాయం ఏర్పడినా, మంచినీటి సమస్య ఉన్నా, మంచినీటి ట్యాంకర్ కావాలన్నా.. వెంటనే ఫోన్ చేయాలని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియతో మాట్లాడుతూ.. ఒకటో సచివాలయం పరిధిలోని వారు 78158 31426, రెండో సచివాలయం 76800 64897, మూడో సచివాలయం 80080 11410, నాల్గో సచివాలయం 85005 94980, ఐదో సచివాలయం 99594 63100, ఆరో సచివాలయం 9550655356, ఏడో సచివాలయం 87901 20976, ఎనిమిదో సచివాలయం 7989192859, తొమ్మిదో సచివాలయం 91644 52675, పదో సచివాలయం 8639246974, 11వ సచివాలయం పరిధిలో వారు 74164 94332 అనే నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు. ప్రజలు ఫోన్ చేసినా.. మంచినీటి సమస్య పరిష్కరించకుండా సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్రైం న్యూస్..

భూమి కోసం రైతుపై దాడి



చికిత్స పొందుతున్న రామాంజనేయులు

కళ్యాణదుర్గం , జూన్ 6(ఆంధ్రజ్యోతి): కంబదూరు మండలంలోని వైసీపల్లిలో రైతు రామాంజినేయులుకు చెందిన భూమి తమదేనంటూ అదే గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు అతనిపై దాడి చేశారు. రామాంజినేయులుకు ఒకటిన్నర ఎకరా డీ పట్టా భూమి ఉంది. ఈ భూమికి సంబంధించిన ఎండార్స్‌మెంట్ పత్రాలు కూడా ఇటీవల తహసీల్దార్ అతనికి ఇచ్చారు. అయితే ఆ భూమి తమదంటూ అదే గ్రామానికి చెందిన ఐదుగురు శుక్రవారం అతనిపై దాడి చేశారు. గాయపడ్డ రామాంజినేయులును కళ్యాణదుర్గం ఆస్పత్రిలో చేర్పించారు. కంబదూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరుగురి బైండోవర్

పెద్దపప్పూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మనచెరువు గ్రామంలో ఆదివారం జరిగిన ఇరువర్గాలు ఘర్షణలో పలువురు గాయపడ్డారు. ఇందుకు కారణమైన ఆరుగురిపై కేసులు నమోదుచేసి బైండోవర్‌కు పంపినట్లు పెద్దపప్పూరు ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ శుక్రవారం తెలిపారు.

గడ్డివామి దగ్ధం

పుట్లూరు, జూన్6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమటికుంట్లలో రైతు జనార్దన్‌రెడ్డికి చెందిన గడ్డివామి శుక్రవారం దగ్ధమైంది. కలం దొడ్డి పక్కనే ఆకతాయిలు మంటలు వేశారని, వాటి నిప్పురవ్వలు వామి మీద పడటంతో ఈ ప్రమాదం జరిగిందని, తమకు సుమారు రూ.50 వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ వెంకటనరసింహం పరిశీలించారు.

● యాడికి: మండలంలోని నగరూరు గ్రామంలో రైతు నారాయణ స్వామికి చెందిన గడ్డిమామి గద్ధమైంది. శుక్రవారం సాయంత్రం చిన్నపిల్లలు ఆడుకుంటూ గడ్డివామికి నిప్పుపెట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. సుమారు రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లినట్లు స్థానికులు తెలిపారు.

బస్సును ఢీకొన్న ఆటో

యాడికి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): గుత్తి నుంచి తాడిపత్రికి వెళుతున్న ఆర్టీసీ బస్సును రాయలచెరువులో వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో దెబ్బతింది. ఈ సంఘటనలో ఆటో డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

ఇద్దరికి గాయాలు

గుత్తి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): గుత్తి ఆర్ఎస్ పత్తికొండ రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జొన్నగిరికి చెందిన శ్రీనివాసులు, శ్రీరాములు గాయపడ్డారు. వీరు గుత్తి నుంచి జొన్నగిరికి బైక్‌లో వెళ్తుండగా బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. గాయపడ్డ వీరిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

17మంది జూదరుల అరెస్ట్

తాడిపత్రి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కలూరు సమీపంలో శుక్రవారం పేకాట ఆడుతున్న 17 మందిని అరెస్ట్ చేసినట్లు సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. వారి నుంచి రూ.1.25 లక్షల నగదు, 17సెల్ ఫోన్లు, తొమ్మిది బైక్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

సచివాలయ ఉద్యోగిపై చర్యలు

బ్రహ్మసముద్రం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతేకొండాపురం పంచాయతీ సచివాలయంలోని హెల్పర్ అసిస్టెంట్ అభిషేక్ వైసీపీ కార్యకర్తలా వ్యవహరిస్తూ.. విధులను నిర్లక్ష్యం చేస్తున్నారని, అతనిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ మల్లెల వనిత ఎంపీడీఓ నందకిషోర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. పలుమార్లు సూచించినా ఆయనలో మార్పురాలేదని మండిపడ్డారు. స్పందించిన ఎంపీడీఓ ఆ హెల్పర్ అసిస్టెంట్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ధర్నా



ఆందోళన చేస్తున్న కాలనీ వాసులు

గుత్తి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): స్థానిక జంగాలకాలనీ వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఆ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆ కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జాతీయ రహదారిలోని జంగాలకాలనీ వద్ద రోడ్డుపై శుక్రవారం బైఠాయించారు. వీరికి డీవైఎఫ్ఐ నాయకులు సంఘీభావం తెలిపారు. అధికారులతో మాట్లాడి.. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని సీఐ వెంకటేశ్వర్లు హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

బెళుగుప్ప, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన హనుమంతరెడ్డి ఏప్రిల్ 4న అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996 పదో తరగతి చదువుకున్నాడు. అతని ఆత్మహత్య విషయం తెలుసుకున్న నాటి విద్యార్థులు రూ. 22 వేలు ఆర్థిక సాయాన్ని శుక్రవారం హనుమంతరెడ్డి భార్య సువర్ణకు అందజేశారు. ఇందులో నాటి విద్యార్థులు తిమ్మారెడ్డి, బాలాజీ, శివయ్య, గంగాధర్‌రెడ్డి, ప్రకాష్, తిప్పేస్వామి, శైలజ, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రికి దుప్పట్ల అందజేత

గుత్తి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ్ భాస్కర్, రంగనాథ్‌రావు రూ.10 వేలు విలువ చేసే 50 దుప్పట్లను అందజేశారు. శుక్రవారం వాటిని ఆ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎల్లప్పకు అందజేశారు. ఇందులో ఆ సమితి నాయకులు సూర్యనారాయణ రెడ్డి, సుధాకర్, జిలాన్, నిజాం, మైను పాల్గొన్నారు.